





ఇక ఉచిత ఇసుక

- 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధానం
- టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం
- అధికారులకు ఆదేశాలిచ్చిన చంద్రబాబు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక విధానం అమలులోకి రానుంది. ఈనెల 8వ తేదీ నుంచి అమలు చేయడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం సంబంధిత మంత్రిత్వశాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు ఆయా జిల్లాల మైన్స్, ఇతర శాఖల అధికార్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలుచేసి పేదలకు ఉపయోగపడేలా వ్యవహరించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఎంతోమంది లబ్ధిపొందారు. నిర్మాణ రంగం పుంజుకుంది. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఇసుక కష్టాలు మొదలయ్యాయి. అన్ని రంగాల మాదిరిగానే ఈ రంగాన్ని కూడా దోపిడీకి మార్గంగా ఎంచుకుంది. టన్నుకు రూ.475 నుంచి రూ.625 వరకూ నిర్ణయించడంతోపాటు డబ్బంతా వైసీపీ పెద్దలే దోచేసుకున్న సంగతి తెలిసిందే. డిమాండు మేరకు సప్లయ్ లేకుండా చేసి లారీ ఇసుక రూ.20 వేల నుంచి రూ.30వేల వరకూ బేరం పెట్టారు. పేదలు కొనుక్కోలేక ఇళ్ల నిర్మాణం కూడా ఆపేశారు. గోదావరి ఇసుక అంతా ఇతర ప్రాంతాలకు తరలిపోయింది. గత ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానం అమలుచేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అనుకున్నవిధంగానే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అఖండ విజయం సాధించింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. కొందరు ఇసుక మంచి ఆదాయ వనరు అని, ఆదాయమార్గంగా ఎంచుకుంటే అప్పుల పాలైన ప్రభుత్వానికి మంచి ఆర్థిక పుష్టి వస్తుందని చాలామంది ప్రభుత్వ పెద్దలకు సలహా ఇచ్చినట్టు సమాచారం. కానీ చంద్రబాబు తాను ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలుచేయడానికే నిర్ణయించారు. దాంతో 8వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక విధానం అమలులోకి రానుంది. దీనికి సంబంధించిన గైడ్‌లైన్స్ ఒకటి రెండ్రోజుల్లో రానున్నాయి. గోదావరిలో ఇసుక తీసి, లోడింగ్ చేయడానికి కొంత చార్జి నిర్ణయిస్తారు. కేవలం అక్కడ లోడింగ్ చార్జి మాత్రం తీసుకుంటారు. ఇక వినియోగదారుడు రవాణా చార్జీలు చెల్లించుకుంటే కావలసినంత ఇసుక ఇంటికి వస్తుంది. దీంతో నిర్మాణరంగం కూడా పుంజుకోనుంది. చంద్రబాబు నిర్ణయంతో అన్నివర్గాల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో స్టాక్‌పాయింట్లలో ఎంత ఇసుక ఉందనేది ప్రస్తుతం లెక్క కడుతున్నారు. దానికి కొంత ధర కట్టి ఇచ్చే ఆలోచన ఉంది. ఇక వర్షాకాలం కాబట్టి ఓపెన్ ర్యాంపులు పూర్తిగా పనిచేసే అవకాశం లేదు. గోదావరికి వరద వస్తే ఓపెన్ ర్యాంపుల్లో ఇసుక తీతకు అనుకూలత ఉండదు. ఈనేపథ్యంలో అఖండగోదావరిలోని డీసిల్టేషన్‌కు అనుమతి ఇవ్వనున్నారు. బోట్స్‌మన్ సొసైటీలకు ఇస్తారా, ర్యాంపుల నిర్వహణకు వేలం వేస్తారా అనేది తేలాల్సి ఉంది. లోడింగ్‌చార్జీలు, రవాణా చార్జీల వివరాలు కూడా స్పష్టంకానున్నాయి. ఇక జిల్లాలో 17 ఓపెన్ ర్యాంపులు ఉన్నాయి. సుమారు 32 వరకూ డీసిల్టేషన్ ర్యాంపులున్నాయి. అవన్నీ ప్రస్తుతం ఆగాయి. కడియం మండలంలో వేమగిరి-కడియంపులంక (బుర్రిలంక), సీతానగరం మండలంలోని వంగలపూడి-1, వంగలపూడి-2, ములకలంక, కాటవరం, పెరవలి మండలంలో ముక్కామల-2, కాకరపర్రు-1, మల్లేశ్వరం, తీపర్రు -2, తీపర్రు -3, పెండ్యాల, కానూరు ర్యాంపులు ఉన్నాయి. నిడదవోలు మండలంలో పందలపర్రు, జీడిగుంట, చిడిపి ర్యాంపులు, కొవ్వూరులో కుమారదేవం-1, కుమారదేవం-2,కుమారదేవం-3, తాళ్లపూడి మండలంలో వేగేశ్వరం ర్యాంపులున్నాయి. అటు అఖండ గోదావరి కుడి ఏటిగట్టు వాడపల్లి, ఔరంగాబాద్, ఔరంగాబాద్-2, ఎరినమ్మ, కొవ్వూరు, దొండగుంట రేవు, ఆరికిరేవుల-1,2, తాళ్లపూడి, ప్రక్కిలంకతోపాటు మొత్తం 10 డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. వీటిలో 33 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. అఖండ గోదావరి ఎడమ ఏటిగట్టు వైపు మొత్తం 28 డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. గాయత్రీ-1 నుంచి 8, కోటిలింగాల 1,3,4,5, కాతేరు 1 నుంచి 15 ర్యాంపులు, వెంకటనగరం ర్యాంపులు ఉన్నాయి. ఈ ర్యాంపులకు మొత్తం 97 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి.

పేదలకు ఉచిత ఇసుక నిర్ణయం హర్షణీయం : ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం సిటీ, జూలై3: పేదల ఇంటి నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక విధానంతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. గతంలో కూడా టీడీపీ హయాంలో అమలుచేసిన ఇసుక పాలసీ పేదలకు మేలు చేసిందన్నారు. వైసీపీ పాలనలో తీసుకువచ్చిన ఇసుక అమ్మకాల విధానం వల్ల పేదలు, గృహ నిర్మాణ రంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. ఇసుక రీచ్‌లు, డంప్‌లు వైసీపీ నేతలు, ప్రైవేటు వ్యక్తుల కబంధ హస్తాల్లో ఉండేదని, ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారన్నారు.

ఇసుక గుట్టల వద్ద దోబూచులాట



ఇసుక గుట్టల వద్ద ఉన్న జేసీబీలు

పెరవలి, జూలై3: ఇసుక గుట్టల వ్యవహారంపై అధికారులు దోబూచులాడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తవ్వకం కాంట్రాక్టు పొందిన జేపీ, ప్రతిమ కంపెనీలు గోదావరిలో ఇసుకను తవ్వి పలుచోట్ల గుట్టలుగా పోశారు. తీపర్రు, ఉసులుమర్రు మధ్య నిడదవోలు-నరసాపురం రోడ్డుకు ఆనుకుని పెద్ద ఇసుక గుట్టలు వేశారు. ప్రభుత్వం మారడంతో ఆ ఇసుక గుట్టలపై ఏవిధమైన నిర్ణయం తీసుకుంటారోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఈలోగా కొంత మంది ఆ ఇసుకను లారీల్లో తరలించుకుపోవడంతో కొవ్వూరు సబ్‌కలెక్టర్ మంగళవారం తనిఖీకి వచ్చారు. నిల్వ ఉన్న ఇసుక ఎంతనేది అంచనా వేసి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడే వరకు ఇసుకను ఎవరూ తరలించడానికి వీలులేదని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే బుధవారం ఉదయం కొన్ని లారీలు అక్కడకు చేరుకున్నాయి. ఇసుక ఎగుమతి చేయడానికి జేసీబీలు కూడా వచ్చాయి. ఈ విషయమై స్థానిక రెవెన్యూ, పోలీసుల వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం లేదని బదులిచ్చారు. మైన్స్ అధికారులూ అందుబాటులో లేరు. బుధవారం సాయంత్రం లారీలు, జేసీబీలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుకపై ఒక నిర్ణయం తీసుకుందని, అందులోభాగంగా ఈ గుట్టలకు అనుమతులు ఇచ్చిన అనంతరం ఎగుమతులు ప్రారంభిస్తారని చెబుతున్నారు.

గుండెల్లో పెట్టుకుని పాలిస్తా!

- ప్రజలు ముందు పవన్‌కల్యాణ్ ప్రమాణం
- సమస్యల పరిష్కారానికి కొంత సమయం కావాలి
- రూ.100 కోట్లతో పిఠాపురం టెంపుల్ సర్క్యూట్
- ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు చర్యలు
- పిఠాపురం సీహెచ్‌సీని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి
- ఉప్పాడ రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్... ఏడాదిలో నిర్మాణం
- గొల్లప్రోలులో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు హామీ
- పిఠాపురంలో విత్తనశుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తాం
- ఉప్పాడ సముద్రపు కోతకు పరిష్కారం చూపిస్తాం
- తీరప్రాంతం ఏడాదిన్నరలోగా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి





పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో వారాహిపై నుంచి మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్, హాజరైన జనం.. వాహనంపై ఇతర నేతలు

పిఠాపురం, జూలై 3: భారతదేశం అంతా ఇటువైపు చూసేలా తీర్పు ఇచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకుని పాలిస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవనకల్యాణ్ అన్నారు. పిఠాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసేందుకుగాను పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో బుధవారం సాయంత్రం వారాహి విజయభేరి సభ నిర్వహించారు. ఈ సభలో ప్రజల సాక్షిగా మీ ముందు ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్నానంటూ పవన్‌కల్యాణ్ అనే నేను భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని, తనను అఖండ మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలు, పెద్దలు, ప్రముఖులు, యువత, మహిళలు, అన్ని వర్గాల వారికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలు అందరికీ హామీ ఇస్తున్నాను.. మానవత్వాన్ని కాపాడతానని, మీ అభ్యున్నతికి నిరంతరం కష్టపడతానని, లంచాలు తీసుకోనని ప్రమాణం చేస్తున్నాను. సమస్యల పరిష్కారానికి కొంత సమయం ఇవ్వాలని పవన్ కోరారు. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠాధిపతి అయిన పురుహూతికా అమ్మవారిని కేంద్రంగా చేసుకుని ప్రసాద్ స్కీమ్ కింద రూ.100 కోట్లతో పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తానని పవన్ తెలిపారు. ఇదే విషయంపై ప్రధాని మోదీని కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్ కోరారని చెప్పారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేస్తామని తెలిపారు. ఈ పనులు పూర్తి చేసేందుకు కొంత సమయం పడుతుందన్నారు. పిఠాపురం సీహెచ్‌సీని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని, ఇక్కడ బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తామని, దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే మొదలైందని వివరించారు. నిత్యం రద్దీగా ఉండే పిఠాపురం-ఉప్పాడ మధ్యగల రైల్వేగేటువద్ద ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేస్తామని ప్రకటించారు. ప్రధాని మోదీని కలిసి ఇదే కోరతానని తెలిపారు. అధికారులు సమయం పడుతుందని చెప్పినా ఎవరితో మాట్లాడాలో చెప్పండి, ఏడాదిలోగా పూర్తి కావాలని చెప్పానన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలును సెరీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతానని... చిత్తూరు, మదనపల్లి, హనుమాన్ జంక్షన్ వంటి ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే రీలింగ్, ఆప్టిమైజింగ్ సెంటర్ ఏర్పాటుచేస్తామని తెలిపారు. గొల్లప్రోలు మండలంలో ఉద్యానవన పంటలు అధికంగా పండుతాయని, ఇక్కడ కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దుర్గాడలో మిర్చి కేంద్రాన్ని ఏర్పాటుచేస్తానని తెలిపారు. పిఠాపురం పశువుల సంత అభివృద్ధికి చర్యలు చేపట్టామని.. ఒకటి, రెండు రోజుల్లోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఉప్పాడ-కాకినాడ తీరప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం

ఉప్పాడ సముద్ర తీరప్రాంతంలో కోత నివారణకు చర్యలు చేపట్టడంతోపాటు ఉప్పాడ-కాకినాడ మధ్యగల 11-13 కిలోమీటర్ల తీరప్రాంత రహదారిని పర్యాటక



ఉప్పాడలో సముద్ర తీరం కోతను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న పవన్‌కల్యాణ్

ప్రాంతంగా అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని పవన్ తెలిపారు. 18 నెలల కాలంలోనే ఈ పనులు పూర్తి చేసి సాయంత్రం పూట ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలు కూర్చుని ప్రకృతిని ఆస్వాదించేలా, యువత ఆడుకునేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, అదే సమయంలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వచ్చే సోమ, మంగళవారాల్లో ఆ డాక్యుమెంట్‌ను రిలీజ్ చేస్తామని చెప్పారు. నేను ఇక్కడకు రాకపోయినా ఎప్పటికప్పుడు నేను నియోజకవర్గానికి ఏ పనిచేశానో చెబుతానని తెలిపారు. కాకినాడ సెజ్‌లో 8 వేల ఎకరాల భూమి ఉందని, ఇక్కడ భూములు కోల్పోయిన రైతుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. ఇక్కడ పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

మీ నమ్మకాన్ని వమ్ము చేయను

నాపై నమ్మకం ఉంచి అత్యధిక మెజార్టీతో గెలిపించిన మీ నమ్మకాన్ని వమ్ము చేయనని పవన్‌కల్యాణ్ అన్నారు. రోడ్లు అన్నింటిని అభివృద్ధి చేస్తానని, తొలుత గుంతలు పూడ్చే పనులు చేపడతామని తెలిపారు. మీరు ఇచ్చిన శక్తి నన్ను ఉప ముఖ్యమంత్రిని చేసిందని చెప్పారు. నన్ను గుండెల్లో పెట్టుకున్న స్థానాన్ని చివరి శ్వాసవరకూ, జగద్దేవిలో ఐక్యం అయ్యే వరకూ కాపాడుకుంటానని తెలిపారు. దత్తాత్రేయ పరంపరను ఆచరించిన వాడిని, శ్రీపాదశ్రీవల్లభ చరిత్ర చదివిన వాడిని కాని స్వామి దర్శనం మాత్రం త్వరగా అవ్వలేదని చెప్పారు. 2014, 2019 సంవత్సరాల్లో ఇక్కడకు వచ్చినా శ్రీపాదశ్రీవల్లభుడిని దర్శించుకోలేకపోయాయని, ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని ప్రకటించిన తర్వాత ఆ స్వామి దర్శన భాగ్యం కల్పించారని తెలిపారు. 2028 నాటికే పిఠాపురాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్ది ఎవ్వరైనా పోటీకి రావాలంటే ఆలోచించేలా చేస్తానని చెప్పారు. పిఠాపురం అభివృద్ధి దేశానికి మోడల్‌గా మారుతుందని తెలిపారు. మీరు గర్వించేలా కష్టపడి పనిచేసి ఈ నేల రుణం తీర్చుకుంటానని చెప్పారు.

నేను ఇక పిఠాపురం వాస్తవ్యుడినే...

తాను ఈరోజు నుంచి పూర్తిగా పిఠాపురం వాస్తవ్యుడినేనని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మాట మీ అందరి ముందు గౌరవంగా చెబుతున్నానని తెలిపారు. మూడు ఎకరాల స్థలం తీసుకున్నానని, కొనుగోలు పత్రాలపై ఈరోజే సంతకం చేశానని చెప్పారు. ఇక్కడే ఇల్లు, పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఒకటి నుంచి రెండు ఎకరాల స్థలం పార్టీ కార్యాలయం నిర్మాణం చేపడతామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు అందరి వచ్చి కూర్చొనేలా ఏర్పాట్లుచేస్తామని చెప్పారు. తనకు వినతులు ఇచ్చేందుకు వస్తున్న వారి నుంచి పిటిషన్లు తీసుకునేందుకు ఐదుగురు సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. ఇందులో వైద్యపరమైన వాటికి అధిక ప్రాధాన్యమివ్వాలని, శాంతి భద్రతలు, కిడ్నాప్ అదృశ్యం కేసులు, యువత ఉపాధి అవకాశాలకు తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే జాబ్‌మేళా నిర్వహిస్తామని, యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు.

వర్మ చెప్పిన మాట నిజమయ్యింది

అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వమని, అసెంబ్లీలోకి అడుగు పెట్టలేవని వైసీపీ నేతలు అన్నారు. అప్పుడు వర్మ ఒక మాటన్నారు. అసెంబ్లీ గేట్లు తోసుకుంటూకాదు బద్దలుకొట్టుకుంటూ పవన్ వస్తాడని, ఆ మాటే నిజమైందని, ప్రజలు సీరియస్‌గా తీసుకుని తనను డిప్యూటీ సీఎం సీటులో కూర్చొబెట్టారని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ విజయాన్ని పిఠాపురం నియోజకవర్గ ప్రజలకే అంకితం చేస్తున్నానని చెప్పారు. సభలో ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు పాల్గొన్నారు.

ముగిసిన మూడు రోజుల పర్యటన

డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లాలో మూడు రోజులు జరిపిన పర్యటన బుధవారం రాత్రి పర్యటన ముగిసింది. 1న పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన ఆయన గొల్లప్రోలు పట్టణంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం, సాయంత్రం జనసైనికులు, వీరమహిళల సమావేశంలో పాల్గొని తన గెలుపునకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. 2న కాకినాడ కలెక్టరు కార్యాలయంలో జరిగిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా, అటవీ పర్యావరణశాఖల సమీక్షలు చేశారు. బుధవారం ఉప్పాడలో సముద్రపుకోత ప్రాంతాన్ని అధికారులు, నిపుణులతో కలిసి పరిశీలించారు. అనంతరం పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో వారాహి విజయభేరి సభలో పాల్గొన్నారు.

కమిషనర్ సారూ.. ఇదేం తీరు!

- ముగ్గురు డ్రైవర్లకు అందలం
- 33 మందికి మొండిచేయి
- కారుణ్య నియామకాలపై తాత్సారం
- నగర పాలక సంస్థలో ఇదీ తంతు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఒక రాచరిక వ్యవస్థలా తయారైంది. ఇప్పటికే వైసీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనుల్లో భారీ అవినీతి జరిగిందే ఆరోపణలు ఉన్నాయి. సీబీసీఐడీతో దర్యాప్తు చేయించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్‌ని ఐఏఎస్ అధికారి నడిపిస్తున్నా జనం సొమ్మును దోపిడీ కాకుండా అడ్డుకోలేకపోయారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో సిబ్బంది విషయంలో కూడా ఇష్టానుసారం వ్యవహరించడం విస్మయం కలిగిస్తోంది. ఉన్నతాధికారుల వద్ద పని చేయడమే అర్హతగా ముగ్గురిని అందలం ఎక్కించడానికి అన్ని చర్యలూ చకచకా జరిగిపోయాయి. కార్పొరేషన్‌లో వివిధ విభాగాల్లో సుమారు వెయ్యి మందికిపైగా పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్నారు. వీరిలో 36 మంది కాంట్రాక్టరు ద్వారా నియమితులయ్యారు. వెహికిల్ యార్డులో, తడి చెత్త పొడిచెత్త వాహనాలపై డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ముగ్గురు మాత్రం ఉన్నతాధికారుల వద్ద డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఇద్దరు గత కలెక్టర్ మాధవీలత వద్ద డ్రైవర్లుగా పనిచేశారు. ప్రస్తుతం ఆమె బదిలీపై విజయవాడ వెళ్లడంతో వీళ్లను కూడా తీసుకెళ్లారు. ఒకరు కమిషనర్ వద్ద వ్యక్తిగత డ్రైవరుగా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురిని ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్స్‌డ్ సర్వీసెస్ (ఆప్కోస్) పరిధిలోకి తీసుకురావడానికి అప్పటి కలెక్టర్ ఆదేశాలివ్వగా ఇప్పటి కమిషనర్ సిఫారసు చేశారు. ఆప్కోస్‌లోకి తీసుకుంటూ ఉత్తర్వులు వెలువడడం మినహా అన్ని పనులూ పూర్తయ్యాయి. దీంతో మిగతా 33 మంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తామే పాపం చేశామని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల వద్ద పనిచేయడమే అర్హతగా భావిస్తే వారికంటే ఎక్కువ శ్రమిస్తున్న తమ జీవితాలను ఎవరు పట్టించుకుంటారంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 36 మందినీ ఆప్కోస్‌లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వేడుకొంటున్నారు. అయితే.. ముగ్గురు డ్రైవర్ల విషయంలో అమితమైన ప్రేమ చూపిస్తున్న ఉన్నతాధికారి కారుణ్య నియామకాలను మాత్రం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది సుదీర్ఘంగా విధులకు రాకపోయినా, మరణించినా మానవతా దృక్పథంలో వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కల్పించి ఆదుకుంటారు. వారిపైనా కనికరం చూపడం లేదు. సుమారు 80 మంది కారుణ్య నియామకం గురించి దరఖాస్తు చేసుకున్నారు. ఏదొక పత్రం తక్కువైందనే సాకుతో వారిని ఇబ్బంది పెడుతున్నారని, అన్నీ సవ్యంగా ఉన్నా నియామక ఉత్తర్వులు ఇవ్వడం లేదని బాధితులు కన్నీరు పెడుతున్నారు. ఆప్కోస్ వెబ్‌సైటులో సర్వర్ సరిగా పనిచేయడం లేదంటూ ఎప్పటికప్పుడు దాటవేస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

'ఎన్‌ఎంఎం స్కాలర్‌షిప్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలి'

రాజమహేంద్రవరం, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2023 డిసెంబరులో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఈ ఏడాది ఆగస్టు 30లోపుగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు పేర్కొన్నారు. అలాగే 2020, 2021, 2022లో ఎంపికైన విదార్థులు కూడా తప్పకుండా రెన్యూవల్ చేసుకోవాలని చెప్పారు. కొత్త మొబైల్ యాప్, అప్డేట్ చేసిన వెబ్ వెర్షన్‌తో వన్ టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్) www.scholarships.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉందన్నారు. ఓటీఆర్ మాడ్యూల్ ఏడాది పొడవునా అందుబాటులో ఉంటుందని, ఈ విధానంలో వచ్చే 14 అంకెల సంఖ్య ఎన్ఎస్‌పీలో స్కాలర్‌షిప్ దరఖాస్తు కోసం అవసరం అవుతుందన్నారు. ఎన్ఎంఎంఎస్ తాజా/పునరుద్ధరణ దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 30 వరకూ మాత్రమే గడువు ఉందన్నారు. గత సంవత్సరంలో చేసిన మాదిరిగానే విద్యార్థి వివరాలను ఒక్క అక్షరం కూడా తప్పు రాకుండా మెరిట్ లిస్ట్, ఆధార్‌లో ఒకేలా ఉండే విధంగా సరి చూసుకొని పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకం విధి విధానాలు పూర్తిగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని.. వాటిని తప్పనిసరిగా పరిశీలించాలని వాసుదేవరావు చెప్పారు.



తాడిపూడి ఎత్తిపోతల పథకం నీటి విడుదల సందర్భంగా పూజలు చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

ఎత్తిపోతల పథకాలను భ్రష్టు పట్టించారు
మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు
పుష్కర, పురుషోత్తపట్నం, తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు సాగునీరు విడుదల - 5లో

పెండింగ్ పనులపై కార్యాచరణ రూపొందించాలి : కలెక్టర్ ప్రశాంతి



కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ పి ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై3: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులపై కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఆర్అండ్‌బీ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రాజమహేంద్రవరంలో 16వ నెంబరు జాతీయ రహదారి, ఎన్‌హెచ్ 216 ప్రారంభం నుంచి చివరివరకు రహదారులకు ఇరువైపుల ఆహ్లాదాన్ని కలిగించే పచ్చదనంతో కూడిన గ్రీనరీలు ఏర్పాటుచేసి అభివృద్ధి చేయాలన్నారు. అలాగే జిల్లా సరిహద్దులు ప్రజలకు తెలియజేసేవిధంగా బోర్డులు పెట్టాలని సూచించారు. మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఆగస్టు చివరి నాటికి వంతెనపై వాహనాల అనుమతించేవిధంగా సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. రాజానగరం ప్రాంతంలో ఏడీబీ రోడ్డు పనుల పురోగతిపై వివరాలు తెలిపారు. అనంతరం జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ డి సురేంద్రనాథ్ మాట్లాడుతూ లాలాచెరువు, ఐటీసీ జంక్షన్, బొమ్మూరు, వేమగిరిలలో ఫ్లైఓవర్ నిర్మాణం, సర్వీస్ రోడ్స్, లైటింగ్ సంబంధించి రూ.345 కోట్లు ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించడం జరిగిందన్నారు. గామన్ జంక్షన్ నుంచి దివాన్‌చెరువు వరకు 2.4 కిమీ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రూ.141 కోట్లు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించగా మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభించనున్నట్టు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్అండ్‌బీ అధికారి ఎస్‌బీవీ రెడ్డి, జాతీయ రహదారుల అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్రబాబు, ఆర్‌డీబీ ఈఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.



కళామతల్లి కిరీటంలో కలికి తురాయి ఎస్వీఆర్ : మంత్రి దుర్గేష్

ధవళేశ్వరం, జూలై3: కళామతల్లి కిరీటంలో కలికి తురాయి ఎస్వీ రంగారావు అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం కాటన్ బ్యారేజ్ సమీపంలో నిలువెత్తు ఎస్వీ రంగారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వనటచక్రవర్తి ఎస్వీ రంగారావు జయంతిని జరుపుకుని ఆయనను గౌరవించుకోవడం ఆనందదాయకమన్నారు. ఎస్వీ రంగారావు అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వేడుకగా అల్లూరి జయంతి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 3 : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని రాష్ట్రస్థాయి వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు రాజమహేంద్రవరం గోదావరి బండ్ విద్యుత్ కార్యాలయం సమీపంలో వేడుకలు జరుగుతాయని, మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పాల్గొంటారని డీఆర్వో తెలిపారు.

ఎత్తిపోతల పథకాలను భ్రష్టు పట్టించారు

జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



నీరు విడుదల చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

సీతానగరం, జూలై 3: రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలను, పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నం గ్రామంలోని పుష్కర-1, పుష్కర-2 ఎత్తిపోతల పథకాలతోపాటు పురుషోత్తపట్నం పంపింగ్ స్కీమ్‌కు మంత్రి స్విచ్ఆన్ చేసి సాగునీరు విడుదల చేశారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతితో కలసి పాల్గొన్న మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడమే కాకుండా ఎత్తిపోతల పథకాలను భ్రష్టు పట్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక యుద్ధప్రాతిపదికన పంపులు సిద్ధంచేసి 15 రోజుల ముందుగానే రైతులకు నీరందించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతుల ఉన్నతికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. 3 వేల క్యూసెక్కుల సామర్థ్యం గల పురుషోత్తపట్నం పంపింగ్‌స్కీం ద్వారా 60 వేల ఎకరాలకు, పుష్కర1, పుష్కర2 ఎత్తిపోతల పథకాల నుంచి 1.40 లక్షల ఎకరాలకు 1400 క్యూసెక్కుల సాగునీటిని కాలువల ద్వారా విడుదల చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టూరి రంగారావు, గద్దే వెంకట కృష్ణచౌదరి, పోలిన కృష్ణ, వలవల రాజా, వలవల నానాజీ, కాండ్రు శ్రీనివాసరావు లక్కిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు విడుదల

తాళ్లపూడి, జూలై 3 : రైతు సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు అన్నారు. తాళ్లపూడి మండలం తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి ఆయకట్టుకు మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పి.ధర్మరాజు సాగునీటిని విడుదల చేశారు. తొలుత పూజలు చేసి, అనంతరం గోదావరి నదికి హారతులిచ్చి మోటారు స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా 14 మండలాల్లో 135 గ్రామాల రైతాంగానికి కాలువల ద్వారా 2 లక్షల 6 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. పంపింగ్ స్కీం నుంచి లక్షా 38 వేల ఎకరాలకు కాలువల ద్వారా సరఫరా చేయనున్నట్లు చెప్పారు. మెట్ట ప్రాంతాల్లో ఉన్న 65 వేల ఎకరాలకు సబ్ లిఫ్టల ద్వారా సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశుతోష్ శ్రీవాస్తవ, ఇరిగేషన్ ఏపీ స్టేట్ అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, ఈఈలు దేవప్రకాష్, ఏసుబాబు, డీఈ రామేశంనాయుడు, ఏఈలు విజయ్‌కుమార్, శ్రీనివాస్, నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, నామన పరమేశ్వరరావు, ముళ్లపూడి శ్రీరామ చంద్రమూర్తి, గన్నిన సత్తిబాబు, కొఠారు వెంకట్రావు, గంటా కృష్ణ, యువగళం సభ్యులు సత్యేంద్ర, భరత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సు సీజ్

రూ.2.88 లక్షల జరిమానా



పోలీసులు సీజ్ చేసిన బస్సు

శంఖవరం/కార్పొరేషన్(కాకినాడ),జూలై 3: పిఠాపురం నుంచి హైదరాబాద్ ప్రయాణిస్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రయాణికులను తరలిస్తుండడంతో కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ వాహనాన్ని తనిఖీ చేశారు. బస్సుకు రోడ్ ట్యాక్స్, పర్మిట్ వంటి అనుమతులు ఏమీ లేకుండానే ప్రయాణిస్తున్న విషయాన్ని గుర్తించి రూ.2,88,500 లక్షలు ఫైన్ వేశారు. బస్సును సీజ్ చేసి కాకినాడ ఆర్టీసీ డిపోకి తరలించామన్నారు. దూర ప్రయాణం చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు అనుమతులు లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: వ్యక్తి మృతి

దివాన్‌చెరువు, జూలై3 : జాతీయ రహదారిపై బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దివాన్‌చెరువు సెంటర్‌లో బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గోకవరం మండలం తిరుమలాయపాలానికి చెందిన పినమరెడ్డి కొండలరావు(44) అక్కడికక్కడే మృతి చెందాడు. బొమ్మూరు ఎస్.ఐ.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. తిరుమలాయపాలానికి చెందిన కొండలరావు బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో తన బైక్‌పై పాలచర్ల వైపు నుంచి శ్రీరాంపురం వైపు వెళ్లేందుకు దివాన్‌చెరువు సెంటర్‌లో రోడ్ క్రాస్ చేస్తున్న సమయంలో విశాఖపట్నం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈప్రమాదంలో కొండలరావు బైక్‌తో సహా లారీ కింద పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. కొండలరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తాడని తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

పంచాయతీలో అవకతవకలపై విచారణ

సీతానగరం, జూలై 3: రఘుదేవపురం పంచాయతీలో జరిగిన అవకతవకలపై బుధవారం పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో నాగలత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 సంవత్సరంలో ఈవోపీఆర్డీ రికార్డులు తనిఖీ లోపాలు ఉన్నాయని నివేదిక ఇవ్వడంతో ఆ నివేదికపై సంబంధిత వ్యక్తులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికి వారి నుంచి నేటి వరకు ఏ విధమైన సమాధానం రాలేదన్నారు. దీంతో బుధవారం విచారణ చేసి సంబంధిత వ్యక్తుల స్టేట్‌మెంట్‌లు తీసుకున్నట్లు చెప్పారు. అవకతవకలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మూర్తి, కార్యదర్శి బి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు

రాజధాని అమరావతి నిర్మాణానికి పింఛన్ విరాళం



పింఛన్ సొమ్ము అందిస్తున్న వెంకటేశ్వరరావు

పి.గన్నవరం, జూలై 3: రాజధాని అమరావతి నిర్మాణానికి ఓ దివ్యాంగుడు పింఛన్ సొమ్ము అందించి ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని బెల్లంపూడి శివారు తాడాల వారిపాలేనికి చెందిన దివ్యాంగుడు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు బుధవారం జూలై నెల పింఛన్ రూ.6 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, చుట్టుగుళ్ల కిశోర్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, పోలిశెట్టి రాజేష్, ఆదిమూలం వెంకటేశ్వరరావు, తాటికాయల శ్రీనివాసరావు, కోట రాజేంద్రప్రసాద్, షేక్ దొరబాబు, కర్రి బాబూరావు, తాటికాయల బాబ్జి, యర్రంశెట్టి వీరాస్వామి పాల్గొన్నారు.

బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్‌పై కేసు నమోదు

దివాన్‌చెరువు, జూలై 3: రాజానగరం మండలం జి.ఎర్రంపాలెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచికి చెందిన బిజినెస్ కరస్పాండెంట్ నానిబాబుపై బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు అయినట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డీవీ ప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బ్యాంక్ ఆఫ్ బరోడా బీసీ పాయింట్‌లో రూ.40 లక్షల గోల్‌మాల్? అనే శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. స్వయం సహాయక సంఘం మహిళా సభ్యురాలు ఫిర్యాదు మేరకు గత నెల 20వ తేదీన విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. సంబంధిత బీసీని నియమించిన నోడల్ ఏజెన్సీ ఈ విషయంలో పూర్తిబాధ్యత వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదే అంశంపై డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వి.వి.ఎస్.మూర్తి వివరాలు తెలియజేస్తూ జి.ఎర్రంపాలెం బ్యాంక్ ఆఫ్ బరోడా సంబంధించిన బీసీ బ్యాంకు లావాదేవీలను పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు విచారణాధికారిగా డీఆర్‌డీఏ అధికారి జనార్ధనరావును నియమించామని తెలిపారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

ఎటపాక, జూలై 3: పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ గాంధీ హిందువుల పట్ల అనుచితంగా మాట్లాడారని ఆరోపిస్తూ ఎటపాక ప్రధాన రహదారిపై బుధవారం భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మూడే సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడారు. రాహుల్ గాంధీ హిందువులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు చింత దుర్గారావు, బీజేపీ నాయకులు కల్లూరి కృష్ణ, మడకం వెంకటేష్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు కృషి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



ఎస్వీ రంగారావు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 3: రాజహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సహజ నటుడు ఎస్వీ రంగారావు 106వ జయంతి సందర్భంగా ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, నగర చిరంజీవి యువత ఆధ్వర్యంలో జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరై గోదావరి గట్టున ఉన్న రంగారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఎస్వీ రంగారావు వంటి మహనీయులు సినీ రంగానికి చేసిన సేవలు, సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా ఉండాలని అన్నారు. సినీ స్టూడియోలు కేవలం తెలంగాణకే పరిమితమయ్యాయని, సినిమా చిత్రీకరణకు అన్ని విధాలా అనువైన నగరంగా ఉన్న రాజమహేంద్రవరం పరిసర ప్రాంతంలో ఒక సినిమా స్టూడియోను ప్రభుత్వ సహకారంతో నిర్మాణం చేపట్టేందుకు తాను తప్పక కృషి చేస్తానని అన్నారు. టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ నాయకులు యర్రా వేణు గోపాలరావు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఆకుల వీర్రాజు, చల్లా శంకరరావు, కార్యక్రమం నిర్వాహకుడు కొత్తపేట రాజా, నందెపు శ్రీనివాస్, అడపా శ్రీహరి, బాక్స్ ప్రసాద్ పాల్గొన్నారు.

వేద పాఠశాల విద్యార్థులకు డయేరియా?

రత్నగిరిపై కలకలం

వాంతులు, విరేచనాలతో ఆరుగురికి అస్వస్థత

చికిత్స అందిస్తున్న వైద్యులు



చికిత్స పొందుతున్న వేద విద్యార్థులు

అన్నవరం, జూలై 3: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సత్యగిరిపై నిర్వహిస్తున్న సత్యదేవా స్మార్త, ఆగమ పాఠశాలలో కలకలం రేగింది. వేదవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులలో కొందరికి వాంతులు, విరేచనాలు కావడంతో మిగిలిన విద్యార్థులు అధికారులకు సమాచారమివ్వడంతో హుటాహుటిన వేదపాఠశాలకు చేరుకుని వైద్యచికిత్సలు అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే సత్యగిరి కొండపై రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 32 మంది బ్రాహ్మణ విద్యార్థులు ఆగమ, స్మార్తవిద్యను అభ్యసిస్తున్నారు. వీరికి వసతి, ఆహారం దేవస్థానమే ఏర్పాటు చేస్తుంది. అయితే బుధవారం విద్యనభ్యసిస్తున్న వారిలో ముందుగా 15 మంది అస్వస్థతకు గురికాగా 9మందికి ప్రాథమిక చికిత్స ద్వారా కోలుకోగా మరో ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆందోళన కలిగింది. విషయం తెలుసుకున్న ఈవో రామచంద్రమోహన్ వైద్యసిబ్బందిని హుటాహుటిన వెళ్లాలని ఆదేశించడంతో దేవస్థానం ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తన సిబ్బందితో చికిత్స అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగురికి డయేరియా లక్షణాలుగా గుర్తించామన్నారు. డీఎంహెచ్ఓ ఆదేశాలతో రావికంపాడు పీహెచ్‌సీ సిబ్బంది పర్యవేక్షిస్తుండగా డిప్యూటీ డీఎంహెచ్ఓ సంఘటన స్థలానికి చేరుకుని నీరు, ఆహార పదార్థాల శాంపిల్స్ ల్యాబ్‌కు తీసుకెళ్లారు. విద్యార్థులందరినీ ఆగమ పాఠశాల నుంచి శివసదన్ కాటేజీకి తరలించి అక్కడ వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు ఇతర అధికారులు దగ్గరుండి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థులంతా కోలుకుని పరిస్థితి సద్దుమణిగిందని డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఇటీవల ఆర్ఓ ప్లాంట్ పాడవడంతో విద్యార్థులు దేవస్థానం వాటర్‌ట్యాంక్ ద్వారా వచ్చే నీటినే తాగుతున్నారని. వంటశాల వద్ద పరిసరాలలో ఈగల మోత అధికంగా ఉంటుందని వంటశాల సిబ్బంది చెబుతున్నారు. బుధవారం సాయంత్రం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి నాయక్ విద్యార్థులను పరామర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. గురువారం ప్రత్యేకించి దీనిపై ఓ కమిటీ ఏర్పాటు చేసి కారణాలను విశ్లేషించనున్నట్లు చెప్పారు.

6 నుంచి లోవలో ఆషాడ మాసోత్సవాలు

తుని రూరల్, జూలై 3: ఈ నెల 6 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు లోవ దేవస్థానంలో ఆషాడ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు లోవకు తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. భక్తుల నుంచి వచ్చిన వరుస ఫిర్యాదుల నేపథ్యంలో లోవ దేవస్థానంలో వివిధ పనుల్లో పాల్గొనే ప్రైవేట్ వ్యక్తులతో ఆలయ అధికారులు, రూరల్ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రైవేట్ కాటేజ్ యజమానులు, వర్కర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు ఇచ్చారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని ఆలయ ప్రాంగణంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్గొన చర్యలు ఉంటాయని ఎస్ఐ రమేష్ బాబు సమావేశంలో తెలిపారు

లోవలో ఆషాడ మాస ప్రత్యేక పూజలు

జూలై 7 ఆదివారం అమ్మవారికి వివిధ రంగుల మట్టిగాజులతో ప్రత్యేక అలంకరణ, జూలై14 ఆదివారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన, 15న అమ్మవారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా పంచామృత అభిషేకం, 17న బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా గణపతి అభిముఖం, గరిక పూజ, గణపతి హోమం, అమ్మవారికి లక్ష పత్రి పూజ, 21 ఆదివారం అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరణ. అదే రోజు పౌర్ణమి సందర్భంగా చండీ హోమం, 28 ఆదివారం అమ్మవారికి లక్ష పుష్పార్చన, 31 ఏకాదశి సందర్భంగా అమ్మవారికి లక్ష బిల్వార్చన, వచ్చే నెల 3న సప్తనది జలాలతో అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం, వచ్చే నెల 4న ఆదివారం 9గంటలకు అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ పండితులు, ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

భూమి కొన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

హైవేకు చేర్చి 3.52 ఎకరాలు కొనుగోలు



పిఠాపురం, జూలై 3: ఎన్నికల ముందు తాను పిఠాపురంలో స్థిర నివాసం ఏర్పరచుకుంటానని, ఇల్లు కట్టుకుంటానని చెప్పిన జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆ దిశగా బుధవారం ముందడుగు వేశారు. పిఠాపురం-గొల్లప్రోలు మార్గంలో 216 జాతీయ రహదారికి చేర్చి భూములను కొనుగోలు చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులోని ఇల్లింద్రాడ వై.జంక్షన్ దాటిన తర్వాత గొల్లప్రోలు టోల్‌గేటుకు వెళ్లే మార్గంలో ఉన్న ఒక రెస్టారెంట్ దగ్గర 3.52 ఎకరాలను పవన్‌కల్యాణ్ కొనుగోలు చేశారు. ఇల్లింద్రాడ రెవెన్యూ పరిధిలోకి వచ్చే 2.08 ఎకరాలు, భోగాపురం రెవెన్యూలోకి వచ్చే 1.44 ఎకరాలను కాకినాడకు చెందిన కోన శ్రీనందు వద్ద నుంచి కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పిఠాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం పూర్తి చేశారు. పవన్‌కల్యాణ్ తరఫున ప్రతినిధిగా కాకినాడ నగర జనసేన అధ్యక్షుడు డాక్టర్ తోట మెహర్ సీతారామ సుధీర్ పాల్గొన్నారు. ఎకరం కోటి రూపాయలకు పైగా వెచ్చించి కొనుగోలు చేసినట్లు సమాచారం. భూమి కొన్న విషయాన్ని పిఠాపురం వారాహి బహిరంగసభలో ప్రకటించిన పవన్‌కల్యాణ్ ఇక్కడే ఇల్లు, పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకుంటానని, ఇకనుంచి తాను పిఠాపురం వాస్తవ్యుడినేనని చెప్పారు.

నిర్వాసితుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న సీతారాం

ఎటపాక, జూలై 3: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కన్నా, నిర్వాసితులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎటపాకలో సొందే రామారావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడారు. సీఎం చంద్రబాబు పోలవరం నిర్మాణం, స్థితిగతులపై సమీక్షలు చేస్తున్నారే తప్పా నిర్వాసితుల ఊసే ఎత్తకపోవడం బాధాకరమన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో వచ్చే వర్షాలతో శబరిపోటు పెరిగి, నాలుగు విలీన మండలాలతో పాటు పక్కనే ఉన్న భద్రాచలం వరకు ముంపు ఉంటుందని చెప్పారు. వరద తీవ్రత పెరిగితే ఏజెన్సీలో 300 గ్రామాలు ముంపులో చిక్కుకుంటాయని అన్నారు. ప్రభుత్వం గోదావరి వరద ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న పది మండలాల్లో నిర్వాసితుల ప్రస్తుత పరిస్థితులపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులను గాలికి వదిలేసిందని, ఈ ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పునరావాసం కోసం నిర్మించిన ఇళ్లల్లోకి నిర్వాసితులను తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవీ, మండల కమిటీ సభ్యులు కాకా అర్జున్, పులుసు బాలకృష్ణ, సోయం వీరమ్మ, రత్తమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ దినేష్‌కుమార్



సమస్యలు వింటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు, జూలై 3: వరదల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో విలీన మండలాల్లోని ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. చింతూరు ఐటీడీఏలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. విలీన మండలాలకు చెందిన పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం వరద పరిస్థితులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముందుగానే సురక్షిత ప్రాంతాలలో బఫర్ స్టాక్ ఉంచాలన్నారు. సురక్షిత ప్రాంతాలను నిర్ణయించుకొని ఆయా ప్రాంతాలలో తాగునీరు, వసతి ఏర్పాట్లను ముందుగానే చేయాలన్నారు. లాంచీలు, మరబోట్లు అవసరాన్ని ముందుగానే గుర్తించి తనకు నివేదిక ఇవ్వాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది మందులను నిల్వ ఉంచుకోవాలన్నారు. వరద తగ్గాక తీసుకోవాల్సిన చర్యలలో భాగంగా అవసరమైన జేసీబీలు, ట్రాక్టర్ల వివరాలను తనకు నివేదిక ద్వారా అందించాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రాచలంలో వరద ఉధృతిని అనుసరించి ప్రజలకు సమాచారం అందిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, డీఎఫ్‌వో భవిత పాల్గొన్నారు.

సీఈని కలిసిన యూనియన్ నాయకులు

మోతుగూడెం, జూలై3: సీలేరు కాంప్లెక్స్ సీఈగా బాధ్యతలు స్వీకరించిన జీఎం వాసుదేవరావును బుధవారం 327 యూనియన్ రీజనల్ సెక్రటరీ పి.ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు సీఈ దృష్టికి తీసుకెళ్లారు. సీఈ సానుకూలంగా స్పందించి మళ్లీ మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, ట్రెజరర్ జి.శ్రీను, బ్రాంచ్ ప్రెసిడెంట్ పి.శ్రీను, బ్రాంచ్ సెక్రటరీ టి.దుర్గాప్రసాద్, శర్మ, నరసింహమూర్తి, టి.శైలజ, దుర్గాదేవి, సుజాత, వరలక్ష్మి, ధనలక్ష్మి, సునీత, సులక్షణ, చిన్నమ్మడు తదితరులు ఆయనను కలిశారు.

సమస్యలపై తక్షణం స్పందించిన ఎమ్మెల్యే శిరీష

అడ్డతీగల, జూలై3: అడ్డతీగలలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాల రహదారి ఛిద్రం అవ్వడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఎమ్మెల్యే శిరీషాదేవి దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణం స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రోడ్డును శుభ్రం చేయించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించారు. అలాగే డ్రైనేజీ నుంచి దుర్గంధం వస్తుందని చెప్పడంతో ఆ సమస్యను కూడా గంట వ్యవధిలో పరిష్కరించారు.



అడిషనల్ ఎస్పీ అనిల్‌ని సత్కరిస్తున్న ఎస్పీ జగదీశ్

అడిషనల్ ఎస్పీ అనిల్ సేవలు ప్రశంసనీయం: ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లా శాంతి భద్రతల విభాగం అడిషనల్ ఎస్పీ అనిల్‌కుమార్ సేవలు మరువలేనివని ఎస్పీ జగదీశ్ ప్రశంసించారు. ఇక్కడ తక్కువ కాలం పనిచేసినా మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. ఉన్నతాధికారులు ఏ విధులు అప్పగించినా శ్రద్ధ, ఓర్పుతో సఫలం చేసేవారన్నారు. ఇలాంటి నిబద్ధత కొద్దిమంది అధికారుల్లో మాత్రమే ఉంటుందని ఆయన చెప్పారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించా రన్నారు. తనకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించారని ఎస్పీ గుర్తు చేసుకున్నారు. అడిషనల్ ఎస్పీ అనిల్ మాట్లాడుతూ ఇక్కడ తక్కువ కాలం పనిచేసినా గొప్ప అనుభవంతో వెళుతున్నానన్నారు. మంచి జిల్లాలో పనిచేశానన్న ఆనందం ఉందన్నారు. సమర్థవంతమైన ఎస్పీ జగదీశ్ ఆధ్వర్యంలో విధులు నిర్వర్తించడం సంతృప్తిని, మరింత అనుభవాన్ని ఇచ్చిందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో బదిలీపై వెళుతున్న అనిల్‌ని ఎస్పీ, అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, ఎస్బీ డీఎస్పీ డి.ప్రభాకర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.రఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయిమహేశ్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

జీడీఎస్‌ను వేధించడం ఆపాలి

• ఏఐజీడీఎస్ యూనియన్ ధర్నా

రాజమహేంద్రవరం, జూలై 3(ఆంధ్రజ్యోతి):లక్ష్యాలను సాధించాలంటూ గ్రామీణ డాక్ సేవక్స్(జీడీఎస్)లను వేధించడం, ఒత్తిడి చేయడం ఆపాలని, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఏఐజీడీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూని యన్ డివిజన్ నాయకులు మాట్లాడుతూ అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యంకాని టార్గెట్లను డీజీ కార్యాలయంలో నిర్ణయించడం నిలుపుదల చేయాలన్నారు. జడీఎస్‌లను డిపార్టుమెంటు ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ వైద్య సదుపాయంతోపాటు గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షలకు పెంచాలన్నారు. 180 రోజుల సెలవులను దాచుకొని నగదుగా మార్చుకొనే సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డివిజనల్ ఎస్‌పీవోలకు మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో సంఘం డివిజనల్ కార్యదర్శి భూలోకం, ట్రెజరర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెలమలకు ఏ ఆపద వచ్చినా ఆదుకుంటాం

• వెలమసంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు



పందలపాకలో నూతనంగా ఏర్పాటైన శ్రీబ్రహ్మనాయుడు వెలమ సంఘ సభ్యులు

బిక్కవోలు, జూలై 3: వెలమ కులస్తులకు ఏ ఆపద వచ్చినా అన్ని విధాలా ఆదుకుంటామని శ్రీబ్రహ్మనాయుడు వెలమ సంఘ అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు తెలిపారు. పందలపాకలో బుధవారం అనపర్తి, మండపేట నియోజకవర్గాల వెలమ సేవా సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా కర్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా నౌడు వెంకటరమణ, గేదెల వీరబాబు, కార్యదర్శిగా కొల్లి శ్రీనివాస్, సహ కార్యదర్శులుగా సప్పా శ్రీనివాస్, భోజంకి శివరామకృష్ణ, కోశాధికారిగా సబ్బారపు సూర్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రతి గ్రామం నుంచి ఒక సభ్యుడిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రెండు నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో వెలమ సోదరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి: ఎంపీపీ

కడియం, జూలై 3: గ్రామాల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల పంపిణీ, మండల అభివృద్ధికి ఉద్యోగులు అంతా ప్రజాప్రతినిధులతో కలిసి కృషిచేయాలన్నారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ మాట్లాడుతూ యాక్షన్‌ప్లాన్, విలేజ్‌ప్రొఫైల్‌ను ప్రతీ పంచాయతీ కార్యదర్శి తయారు చేసుకోవాలన్నారు. విస్తరణాధికారి విక్టర్‌బాబు మాట్లాడుతూ ఉదయం ఏడు గంటల లోపు శానిటేషన్ చేయించాలని, డస్ట్‌బిన్స్ ఏర్పాటు, టైం ప్రకారం గార్బేజ్ తరలించాలని సూచించారు. వైస్ ఎంపీపీ పంతం గణపతి, కూటమి నాయకులు, గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5 కార్యదర్శులు, వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన భోజనం పెట్టండి: డీఈవో

రాజానగరం, జూలై 3: పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న మధ్యాహ్నభోజనం పథకాన్ని సక్రమంగా అమలుచేస్తూ విద్యార్థులకు పరిశుభ్రమైన భోజనం వండి వడ్డించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు సూచించారు. మండలంలో పల్లకడియం హైస్కూల్‌తోపాటు ఎంపీపీఎస్-1,2 పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు సంబంధించిన స్టూడెంట్ కిట్స్, అడ్మిషన్లు తదితర విషయాలపై సమీక్షించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి డయేరియా వ్యాపిస్తున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థులంతా తమ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులకు తాగునీరు వేడిచేసి అందించాలన్నారు. బ్లీచింగ్ చల్లి దోమలు, ఈగలు లేకుండా చూడాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. డీఈవో వెంట ఎంఈవో-2 జ్యోతి ప్రసాద్ ఉన్నారు.

కలెక్టర్ ప్రశాంతిని కలిసిన గన్నికృష్ణ



కలెక్టర్ ప్రశాంతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 3: జిల్లా కలెక్టర్‌గా వచ్చిన పి.ప్రశాంతిని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన గన్నికృష్ణ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. గన్నికృష్ణతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశినవీన్ కుమార్, నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్, మాజీ కార్పొరేటర్ ఇన్న మూరి రాంబాబు, మళ్ళ వెంకట్రాజులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భరత్ రామ్ పెట్టిన సమావేశం తుస్సుమంది

• టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 3: రాజమహేంద్రవరం మార్గాని ఎస్టేట్‌లో మాజీ ఎంపీ భరత్ రామ్ నిర్వహించిన సిటీ వైసీపీ విస్తృతస్థాయి సమావేశానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాక తుస్సుమందని టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు అన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాము ప్రతి పక్షంలో ఉన్నప్పుడు విస్తృత స్థాయి సమావేశం నిర్వహించేందుకు తమ పార్టీ క్యాడర్‌కు ఒక్క సమాచారం ఇస్తే నగరంలో 42 డివిజన్ల నుంచి వేలాది తరలివచ్చేవారని గుర్తు చేశారు. భరత్‌రామ్ చుట్టూ తిరిగే వారు కూడా సమావేశానికి రాలేదని దీంతో భరత్ రామ్ నిరుత్సాహ పడ్డట్టు ఉన్నారని అన్నారు. ఆదిరెడ్డి కుటుంబం అధికారంలో ఉన్న లేకున్న అందరిని కలుపుకుని వెళ్ళడంతోనే క్యాడర్ ప్రతిక్షణం వారితోనే ఉందన్నారు.

కార్యకర్తల కష్టమే నేటి ఎమ్మెల్యే పదవి..

• ఏమిచ్చి రుణం తీర్చుకోగలను • అభినందన సభలో ఎమ్మెల్యే నల్లమిల్లి



నాయకులను, సిబ్బందిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, జూలై 3 : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థిత్వం నుంచి ఎన్నికల వరకు కూటమి నాయకులు, కార్యకర్తలను తన వెన్నంటి ఉన్నారని వారి కష్టానికి ఫలితమే నేడు తనకు లభించిన ఎమ్మెల్యే పదవిని ఈ పదవిని కార్యకర్తలకు అంకితమిస్తున్నానని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సాధారణంగా నాయకుడు ఎన్నికలలో విజయం సాధించిన తరువాత నాయకులు, కార్యకర్తలు అభినందనసభ ఏర్పాటుచేసుకుని నాయకుడిని సత్కరించుకోవడం పరిపాటిగా వస్తోంది. అయితే అనపర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన విజయంకోసం పాటుపడిన నాయకులను, కార్యకర్తలను సత్కరించుకోవాలన్న సంకల్పంతో ఆయనే స్వయంగా నాయకులకు కార్యకర్తలకు అభినందన సభ ఏర్పాటుచేశారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలోని ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన అభినందన సభకు బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ముందుగా తన విజయం కోసం కృషిచేసిన నాయకులకు, కార్యకర్తలకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేనంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి కార్యకర్తలకు పాదాభివందన చేస్తూ వేదికపై నుండే శాష్టాంగ ప్రణామం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి చేతుల మీదుగా బీజేపీ నుండి శివరామకృష్ణంరాజు, జనసేన నుండి రావాడ నాగును, సోషల్ మీడియా నుంచి కోనాల వెంకటరెడ్డి, ఐదేళ్లుగా తనకు ప్రాణహాని ఉందని తెలిసి వెన్నంటి నిలిచిన నల్లమిల్లి సుబ్బారెడ్డి, తనతోపాటు ప్రతి కార్యక్రమంలోను పాల్గొంటూ తనతో సమానంగా పనిచేసిన పీఏ జగదీష్, ఏ నిమిషంలో ఎక్కడకు వెళ్లాలన్నా తనకంటే ముందుగా సిద్ధంగా ఉంటూ కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్‌లను ఎమ్మెల్యే సత్కరించారు. ఆరుగురికి మాత్రమే సన్మానం చేసినా ఈ సన్మానాలు ప్రతి కార్యకర్తకు వర్తిస్తాయన్నారు. నల్లమిల్లి ప్రసంగిస్తూ ఐదేళ్లుగా అప్పటి అధికార పక్షం చేస్తున్న అవినీతి అరాచకాలపై పోరాటం చేసేందుకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా తనతో నిలిచిన కార్యకర్తలకు రుణపడి ఉంటానని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల బాధ్యత తాను చూసుకుంటానని గ్రామాల్లో మూడు పార్టీల నాయకులు ఐకమత్యంతో ముందుకు సాగుతూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పేదలకు అందేవిధంగా కృషి చేయాలని అన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకున్నా సమర్థవంతంగా రాష్ట్రాన్ని ముందుకు నడపగల నాయకుడు ముఖ్యమంత్రిగా వచ్చాడని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లిని ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, ఆళ్ళ గోవిందు, కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీలు, జెడ్‌పీటీసీలు, తెలుగు మహిళలు, టీడీపీ జనసేన బీజేపీ పార్టీల నాలుగు మండలాల అధ్యక్షులు కార్యదర్శులు నల్లమిల్లి కుటుంబ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనపర్తి వర్తక సంఘం అధ్యక్షుడిగా వెంకటరామారెడ్డి

• ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి



అనపర్తి వర్తక సంఘం నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూటమి నాయకులు

అనపర్తి, జూలై 3: అనపర్తి వర్తకులకు అండగా ఉంటానని ప్రభుత్వ పరంగా ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తూ వారి అభివృద్ధికి పాటు పడతానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని చిర్ల తిలక్‌రెడ్డి వర్తక సంఘ కళ్యాణమండపంలో వర్తక సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొవ్వూరి వెంకటరామారెడ్డి(టైర్‌షాపు), గౌరవాధ్యక్షుడిగా సత్తి వెంకట రామారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నల్లమిల్లి ఈశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నల్లమిల్లి గోవిందరెడ్డి, సహాయ కార్యదర్శులుగా వెచ్చా శేషుబాబు, సూర్యనారా యణరెడ్డి, ట్రెజరర్‌గా మేడపాటి సత్యనారాయణరెడ్డిలను ఎమ్మెల్యే నల్లమిల్లి అభినందించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి ప్రసంగిస్తూ అనపర్తి వర్తక సంఘానికి ప్రత్యేక స్థానం ఉందని ఇక్కడ అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రతిఒక్కరూ సంఘం అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా వర్తకుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కృషిచేసి సంఘానికి భవనాన్ని సమకూర్చారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లిని నూతన కార్యవర్గం సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, తాడి గంగిరెడ్డి, వర్తక పెద్దలు, వర్తకులు పాల్గొన్నారు.

సభ్యులంతా కంప్యూటరైజేషన్ చేయించుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్, జూలై 3: రాజమహేంద్రవరం రూరల్ మండలం మిర్తిపాడు ది వెంకటరామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతిసంఘంలో సభ్యత్వం కలిగిన సభ్యులంతా వివరాలను తప్పనిసరిగా కంప్యూటరైజేషన్ చేయించుకోవాలని మిర్తిపాడు పీఏసీఎస్ సీఈవో, ఆఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యత్వం ఉన్న సభ్యులంతా ఆధార్‌కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో ఈనెల 5వ తేదీలోపు ఇచ్చి కంప్యూటరైజేషన్‌కు సహకరించాలన్నారు. సొసైటీలో ఓటు హక్కు వినియోగానికి కంప్యూటరైజేషన్ చేయించుకోవడం తప్పనిసరి అన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

• ఐసీడీఎస్ పీడీ విజయకుమారి

రంగంపేట, జూలై 3: డయేరియాపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజల్లో అవగాహన కల్పించేలా అందరూ కలిసి పనిచేయాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా బుధవారం రంగంపేట మండలం ఈలకొలను, జి.దొంతమూరు, వీరంపాలెం గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలలో గల తల్లులతో సామావేశాలు నిర్వహించారు. స్టాప్ డయేరియా కోసం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ డయేరియా వ్యాధి గురించి 5 సంవత్సరాలలోపు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో వేడిగా ఉన్న ఆహారాన్ని అందించాలని, కాచి చల్లార్చిన తాగునీటి ఇవ్వాలని ఆమె సూచించారు. ఆయా గ్రామాల ఎన్డీయే నాయకులు, కె. సాయిబాబు, గ్రామ సర్పంచ్‌లు,వడిశలేరు సెక్టార్ సూపర్‌వైజర్ గుల్జార్ బేగం,అంగన్‌వాడీ వర్కర్ చంద్రావతి,హెల్పేర్ సుబ్బలక్ష్మీ, హెల్త్ స్టాఫ్ గంగరాజు, తల్లులు పాల్గొన్నారు.





ఇక ఉచిత ఇసుక

- 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధానం
- టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం
- అధికారులకు ఆదేశాలిచ్చిన చంద్రబాబు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక విధానం అమలులోకి రానుంది. ఈనెల 8వ తేదీ నుంచి అమలు చేయడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం సంబంధిత మంత్రిత్వశాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు ఆయా జిల్లాల మైన్స్, ఇతర శాఖల అధికార్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలుచేసి పేదలకు ఉపయోగపడేలా వ్యవహరించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఎంతోమంది లబ్ధిపొందారు. నిర్మాణ రంగం పుంజుకుంది. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఇసుక కష్టాలు మొదలయ్యాయి. అన్ని రంగాల మాదిరిగానే ఈ రంగాన్ని కూడా దోపిడీకి మార్గంగా ఎంచుకుంది. టన్నుకు రూ.475 నుంచి రూ.625 వరకూ నిర్ణయించడంతోపాటు డబ్బంతా వైసీపీ పెద్దలే దోచేసుకున్న సంగతి తెలిసిందే. డిమాండు మేరకు సప్లయ్ లేకుండా చేసి లారీ ఇసుక రూ.20 వేల నుంచి రూ.30వేల వరకూ బేరం పెట్టారు. పేదలు కొనుక్కోలేక ఇళ్ల నిర్మాణం కూడా ఆపేశారు. గోదావరి ఇసుక అంతా ఇతర ప్రాంతాలకు తరలిపోయింది. గత ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానం అమలుచేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అనుకున్నవిధంగానే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అఖండ విజయం సాధించింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. కొందరు ఇసుక మంచి ఆదాయ వనరు అని, ఆదాయమార్గంగా ఎంచుకుంటే అప్పుల పాలైన ప్రభుత్వానికి మంచి ఆర్థిక పుష్టి వస్తుందని చాలామంది ప్రభుత్వ పెద్దలకు సలహా ఇచ్చినట్టు సమాచారం. కానీ చంద్రబాబు తాను ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలుచేయడానికే నిర్ణయించారు. దాంతో 8వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక విధానం అమలులోకి రానుంది. దీనికి సంబంధించిన గైడ్‌లైన్స్ ఒకటి రెండ్రోజుల్లో రానున్నాయి. గోదావరిలో ఇసుక తీసి, లోడింగ్ చేయడానికి కొంత చార్జి నిర్ణయిస్తారు. కేవలం అక్కడ లోడింగ్ చార్జి మాత్రం తీసుకుంటారు. ఇక వినియోగదారుడు రవాణా చార్జీలు చెల్లించుకుంటే కావలసినంత ఇసుక ఇంటికి వస్తుంది. దీంతో నిర్మాణరంగం కూడా పుంజుకోనుంది. చంద్రబాబు నిర్ణయంతో అన్నివర్గాల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో స్టాక్‌పాయింట్లలో ఎంత ఇసుక ఉందనేది ప్రస్తుతం లెక్క కడుతున్నారు. దానికి కొంత ధర కట్టి ఇచ్చే ఆలోచన ఉంది. ఇక వర్షాకాలం కాబట్టి ఓపెన్ ర్యాంపులు పూర్తిగా పనిచేసే అవకాశం లేదు. గోదావరికి వరద వస్తే ఓపెన్ ర్యాంపుల్లో ఇసుక తీతకు అనుకూలత ఉండదు. ఈనేపథ్యంలో అఖండగోదావరిలోని డీసిల్టేషన్‌కు అనుమతి ఇవ్వనున్నారు. బోట్స్‌మన్ సొసైటీలకు ఇస్తారా, ర్యాంపుల నిర్వహణకు వేలం వేస్తారా అనేది తేలాల్సి ఉంది. లోడింగ్‌చార్జీలు, రవాణా చార్జీల వివరాలు కూడా స్పష్టంకానున్నాయి. ఇక జిల్లాలో 17 ఓపెన్ ర్యాంపులు ఉన్నాయి. సుమారు 32 వరకూ డీసిల్టేషన్ ర్యాంపులున్నాయి. అవన్నీ ప్రస్తుతం ఆగాయి. కడియం మండలంలో వేమగిరి-కడియంపులంక (బుర్రిలంక), సీతానగరం మండలంలోని వంగలపూడి-1, వంగలపూడి-2, ములకలంక, కాటవరం, పెరవలి మండలంలో ముక్కామల-2, కాకరపర్రు-1, మల్లేశ్వరం, తీపర్రు -2, తీపర్రు -3, పెండ్యాల, కానూరు ర్యాంపులు ఉన్నాయి. నిడదవోలు మండలంలో పందలపర్రు, జీడిగుంట, చిడిపి ర్యాంపులు, కొవ్వూరులో కుమారదేవం-1, కుమారదేవం-2,కుమారదేవం-3, తాళ్లపూడి మండలంలో వేగేశ్వరం ర్యాంపులున్నాయి. అటు అఖండ గోదావరి కుడి ఏటిగట్టు వాడపల్లి, ఔరంగాబాద్, ఔరంగాబాద్-2, ఎరినమ్మ, కొవ్వూరు, దొండగుంట రేవు, ఆరికిరేవుల-1,2, తాళ్లపూడి, ప్రక్కిలంకతోపాటు మొత్తం 10 డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. వీటిలో 33 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. అఖండ గోదావరి ఎడమ ఏటిగట్టు వైపు మొత్తం 28 డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. గాయత్రీ-1 నుంచి 8, కోటిలింగాల 1,3,4,5, కాతేరు 1 నుంచి 15 ర్యాంపులు, వెంకటనగరం ర్యాంపులు ఉన్నాయి. ఈ ర్యాంపులకు మొత్తం 97 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి.

పేదలకు ఉచిత ఇసుక నిర్ణయం హర్షణీయం : ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం సిటీ, జూలై3: పేదల ఇంటి నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక విధానంతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. గతంలో కూడా టీడీపీ హయాంలో అమలుచేసిన ఇసుక పాలసీ పేదలకు మేలు చేసిందన్నారు. వైసీపీ పాలనలో తీసుకువచ్చిన ఇసుక అమ్మకాల విధానం వల్ల పేదలు, గృహ నిర్మాణ రంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. ఇసుక రీచ్‌లు, డంప్‌లు వైసీపీ నేతలు, ప్రైవేటు వ్యక్తుల కబంధ హస్తాల్లో ఉండేదని, ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారన్నారు.

ఇసుక గుట్టల వద్ద దోబూచులాట



ఇసుక గుట్టల వద్ద ఉన్న జేసీబీలు

పెరవలి, జూలై3: ఇసుక గుట్టల వ్యవహారంపై అధికారులు దోబూచులాడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తవ్వకం కాంట్రాక్టు పొందిన జేపీ, ప్రతిమ కంపెనీలు గోదావరిలో ఇసుకను తవ్వి పలుచోట్ల గుట్టలుగా పోశారు. తీపర్రు, ఉసులుమర్రు మధ్య నిడదవోలు-నరసాపురం రోడ్డుకు ఆనుకుని పెద్ద ఇసుక గుట్టలు వేశారు. ప్రభుత్వం మారడంతో ఆ ఇసుక గుట్టలపై ఏవిధమైన నిర్ణయం తీసుకుంటారోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఈలోగా కొంత మంది ఆ ఇసుకను లారీల్లో తరలించుకుపోవడంతో కొవ్వూరు సబ్‌కలెక్టర్ మంగళవారం తనిఖీకి వచ్చారు. నిల్వ ఉన్న ఇసుక ఎంతనేది అంచనా వేసి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడే వరకు ఇసుకను ఎవరూ తరలించడానికి వీలులేదని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే బుధవారం ఉదయం కొన్ని లారీలు అక్కడకు చేరుకున్నాయి. ఇసుక ఎగుమతి చేయడానికి జేసీబీలు కూడా వచ్చాయి. ఈ విషయమై స్థానిక రెవెన్యూ, పోలీసుల వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం లేదని బదులిచ్చారు. మైన్స్ అధికారులూ అందుబాటులో లేరు. బుధవారం సాయంత్రం లారీలు, జేసీబీలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుకపై ఒక నిర్ణయం తీసుకుందని, అందులోభాగంగా ఈ గుట్టలకు అనుమతులు ఇచ్చిన అనంతరం ఎగుమతులు ప్రారంభిస్తారని చెబుతున్నారు.

- ప్రజలు ముందు పవన్‌కల్యాణ్ ప్రమాణం
- సమస్యల పరిష్కారానికి కొంత సమయం కావాలి
- రూ.100 కోట్లతో పిఠాపురం టెంపుల్ సర్క్యూట్
- ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకీకరణకు చర్యలు
- పిఠాపురం సీహెచ్‌సీని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి
- ఉప్పాడ రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్... ఏడాదిలో నిర్మాణం
- గొల్లప్రోలులో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు హామీ
- పిఠాపురంలో విత్తనశుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తాం
- ఉప్పాడ సముద్రపు కోతకు పరిష్కారం చూపిస్తాం
- తీరప్రాంతం ఏడాదిన్నరలోగా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి





పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో వారాహిపై నుంచి మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్, హాజరైన జనం.. వాహనంపై ఇతర నేతలు

గుండెల్లో పెట్టుకుని పాలిస్తా!

పిఠాపురం, జూలై 3: భారతదేశం అంతా ఇటువైపు చూసేలా తీర్పు ఇచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకుని పాలిస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవనకల్యాణ్ అన్నారు. పిఠాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసేందుకుగాను పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో బుధవారం సాయంత్రం వారాహి విజయభేరి సభ నిర్వహించారు. ఈ సభలో ప్రజల సాక్షిగా మీ ముందు ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్నానంటూ పవన్‌కల్యాణ్ అనే నేను భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని, తనను అఖండ మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలు, పెద్దలు, ప్రముఖులు, యువత, మహిళలు, అన్ని వర్గాల వారికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలు అందరికీ హామీ ఇస్తున్నాను.. మానవత్వాన్ని కాపాడతానని, మీ అభ్యున్నతికి నిరంతరం కష్టపడతానని, లంచాలు తీసుకోనని ప్రమాణం చేస్తున్నాను. సమస్యల పరిష్కారానికి కొంత సమయం ఇవ్వాలని పవన్ కోరారు. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠాధిపతి అయిన పురుహుతికా అమ్మవారిని కేంద్రంగా చేసుకుని ప్రసాద్ స్కీమ్ కింద రూ.100 కోట్లతో పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తానని పవన్ తెలిపారు. ఇదే విషయంపై ప్రధాని మోదీని కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్ కోరారని చెప్పారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేస్తామని తెలిపారు. ఈ పనులు పూర్తి చేసేందుకు కొంత సమయం పడుతుందన్నారు. పిఠాపురం సీహెచ్‌సీని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని, ఇక్కడ బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తామని, దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే మొదలైందని వివరించారు. నిత్యం రద్దీగా ఉండే పిఠాపురం-ఉప్పాడ మధ్యగల రైల్వేగేటువద్ద ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేస్తామని ప్రకటించారు. ప్రధాని మోదీని కలిసి ఇదే కోరతానని తెలిపారు. అధికారులు సమయం పడుతుందని చెప్పినా ఎవరితో మాట్లాడాలో చెప్పండి, ఏడాదిలోగా పూర్తి కావాలని చెప్పానన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలును సెరీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతానని... చిత్తూరు, మదనపల్లి, హనుమాన్ జంక్షన్ వంటి ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే రీలింగ్, ఆప్టిమైజింగ్ సెంటర్ ఏర్పాటుచేస్తామని తెలిపారు. గొల్లప్రోలు మండలంలో ఉద్యానవన పంటలు అధికంగా పండుతాయని, ఇక్కడ కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దుర్గాడలో మిర్చి కేంద్రాన్ని ఏర్పాటుచేస్తానని తెలిపారు. పిఠాపురం పశువుల సంత అభివృద్ధికి చర్యలు చేపట్టామని... ఒకటి, రెండు రోజుల్లోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఉప్పాడ-కాకినాడ తీరప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం

ఉప్పాడ సముద్ర తీరప్రాంతంలో కోత నివారణకు చర్యలు చేపట్టడంతోపాటు ఉప్పాడ-కాకినాడ మధ్యగల 11-13 కిలోమీటర్ల తీరప్రాంత రహదారిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని పవన్ తెలిపారు. 18 నెలల కాలంలోనే ఈ పనులు పూర్తి చేసి సాయంత్రం పూట ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలు కూర్చుని ప్రకృతిని ఆస్వాదించేలా, యువత ఆడుకునేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, అదే సమయంలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వచ్చే సోమ, మంగళవారాల్లో ఆ డాక్యుమెంట్‌ను రిలీజ్ చేస్తామని చెప్పారు. నేను ఇక్కడకు రాకపోయినా ఎప్పటికప్పుడు నేను నియోజకవర్గానికి ఏ పనిచేశానో చెబుతానని తెలిపారు. కాకినాడ సెజ్‌లో 8 వేల ఎకరాల భూమి ఉందని, ఇక్కడ భూములు కోల్పోయిన రైతుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. ఇక్కడ పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.



ఉప్పాడలో సముద్ర తీరం కోతను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న పవన్‌కల్యాణ్

మీ నమ్మకాన్ని వమ్ము చేయను

నాపై నమ్మకం ఉంచి అత్యధిక మెజార్టీతో గెలిపించిన మీ నమ్మకాన్ని వమ్ము చేయనని పవన్‌కల్యాణ్ అన్నారు. రోడ్లు అన్నింటిని అభివృద్ధి చేస్తానని, తొలుత గుంతలు పూడ్చే పనులు చేపడతామని తెలిపారు. మీరు ఇచ్చిన శక్తి నన్ను ఉప ముఖ్యమంత్రిని చేసిందని చెప్పారు. నన్ను గుండెల్లో పెట్టుకున్న స్థానాన్ని చివరి శ్వాసవరకూ, జగద్దేవిలో ఐక్యం అయ్యే వరకూ కాపాడుకుంటానని తెలిపారు. దత్తాత్రేయ పరంపరను ఆచరించిన వాడిని, శ్రీపాదశ్రీవల్లభ చరిత్ర చదివిన వాడిని కాని స్వామి దర్శనం మాత్రం త్వరగా అవ్వలేదని చెప్పారు. 2014, 2019 సంవత్సరాల్లో ఇక్కడకు వచ్చినా శ్రీపాదశ్రీవల్లభుడిని దర్శించుకోలేకపోయాయని, ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని ప్రకటించిన తర్వాత ఆ స్వామి దర్శన భాగ్యం కల్పించారని తెలిపారు. 2028 నాటికే పిఠాపురాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్ది ఎవ్వరైనా పోటీకి రావాలంటే ఆలోచించేలా చేస్తానని చెప్పారు. పిఠాపురం అభివృద్ధి దేశానికి మోడల్‌గా మారుతుందని తెలిపారు. మీరు గర్వించేలా కష్టపడి పనిచేసి ఈ నేల రుణం తీర్చుకుంటానని చెప్పారు.

నేను ఇక పిఠాపురం వాస్తవ్యుడినే...

తాను ఈరోజు నుంచి పూర్తిగా పిఠాపురం వాస్తవ్యుడినేనని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మాట మీ అందరి ముందు గౌరవంగా చెబుతున్నానని తెలిపారు. మూడు ఎకరాల స్థలం తీసుకున్నానని, కొనుగోలు పత్రాలపై ఈరోజే సంతకం చేశానని చెప్పారు. ఇక్కడే ఇల్లు, పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఒకటి నుంచి రెండు ఎకరాల స్థలం పార్టీ కార్యాలయం నిర్మాణం చేపడతామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు అందరి వచ్చి కూర్చొనేలా ఏర్పాట్లుచేస్తామని చెప్పారు. తనకు వినతులు ఇచ్చేందుకు వస్తున్న వారి నుంచి పిటిషన్లు తీసుకునేందుకు ఐదుగురు సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. ఇందులో వైద్యపరమైన వాటికి అధిక ప్రాధాన్యమివ్వాలని, శాంతి భద్రతలు, కిడ్నాప్ అదృశ్యం కేసులు, యువత ఉపాధి అవకాశాలకు తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే జాబ్‌మేళా నిర్వహిస్తామని, యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు.

వర్మ చెప్పిన మాట నిజమయ్యింది

అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వమని, అసెంబ్లీలోకి అడుగు పెట్టలేవని వైసీపీ నేతలు అన్నారు. అప్పుడు వర్మ ఒక మాటన్నారు. అసెంబ్లీ గేట్లు తోసుకుంటూకాదు బద్దలుకొట్టుకుంటూ పవన్ వస్తాడని, ఆ మాటే నిజమైందని, ప్రజలు సీరియస్‌గా తీసుకుని తనను డిప్యూటీ సీఎం సీటులో కూర్చొబెట్టారని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ విజయాన్ని పిఠాపురం నియోజకవర్గ ప్రజలకే అంకితం చేస్తున్నానని చెప్పారు. సభలో ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు పాల్గొన్నారు.

ముగిసిన మూడు రోజుల పర్యటన

డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లాలో మూడు రోజులు జరిపిన పర్యటన బుధవారం రాత్రి పర్యటన ముగిసింది. 1న పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన ఆయన గొల్లప్రోలు పట్టణంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం, సాయంత్రం జనసైనికులు, వీరమహిళల సమావేశంలో పాల్గొని తన గెలుపునకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. 2న కాకినాడ కలెక్టరు కార్యాలయంలో జరిగిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా, అటవీ పర్యావరణశాఖల సమీక్షలు చేశారు. బుధవారం ఉప్పాడలో సముద్రపుకోత ప్రాంతాన్ని అధికారులు, నిపుణులతో కలిసి పరిశీలించారు. అనంతరం పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో వారాహి విజయభేరి సభలో పాల్గొన్నారు.

కమిషనర్ సారూ.. ఇదేం తీరు!

- ముగ్గురు డ్రైవర్లకు అందలం
- 33 మందికి మొండిచేయి
- కారుణ్య నియామకాలపై తాత్సారం
- నగర పాలక సంస్థలో ఇదీ తంతు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఒక రాచరిక వ్యవస్థలా తయారైంది. ఇప్పటికే వైసీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనుల్లో భారీ అవినీతి జరిగిందే ఆరోపణలు ఉన్నాయి. సీబీసీఐడీతో దర్యాప్తు చేయించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్‌ని ఐఏఎస్ అధికారి నడిపిస్తున్నా జనం సొమ్మును దోపిడీ కాకుండా అడ్డుకోలేకపోయారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో సిబ్బంది విషయంలో కూడా ఇష్టానుసారం వ్యవహరించడం విస్మయం కలిగిస్తోంది. ఉన్నతాధికారుల వద్ద పని చేయడమే అర్హతగా ముగ్గురిని అందలం ఎక్కించడానికి అన్ని చర్యలూ చకచకా జరిగిపోయాయి. కార్పొరేషన్‌లో వివిధ విభాగాల్లో సుమారు వెయ్యి మందికిపైగా పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్నారు. వీరిలో 36 మంది కాంట్రాక్టరు ద్వారా నియమితులయ్యారు. వెహికిల్ యార్డులో, తడి చెత్త పొడిచెత్త వాహనాలపై డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ముగ్గురు మాత్రం ఉన్నతాధికారుల వద్ద డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఇద్దరు గత కలెక్టర్ మాధవీలత వద్ద డ్రైవర్లుగా పనిచేశారు. ప్రస్తుతం ఆమె బదిలీపై విజయవాడ వెళ్లడంతో వీళ్లను కూడా తీసుకెళ్లారు. ఒకరు కమిషనర్ వద్ద వ్యక్తిగత డ్రైవరుగా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురిని ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్స్‌డ్ సర్వీసెస్ (ఆప్కోస్) పరిధిలోకి తీసుకురావడానికి అప్పటి కలెక్టర్ ఆదేశాలివ్వగా ఇప్పటి కమిషనర్ సిఫారసు చేశారు. ఆప్కోస్‌లోకి తీసుకుంటూ ఉత్తర్వులు వెలువడడం మినహా అన్ని పనులూ పూర్తయ్యాయి. దీంతో మిగతా 33 మంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తామే పాపం చేశామని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల వద్ద పనిచేయడమే అర్హతగా భావిస్తే వారికంటే ఎక్కువ శ్రమిస్తున్న తమ జీవితాలను ఎవరు పట్టించుకుంటారంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 36 మందినీ ఆప్కోస్‌లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వేడుకొంటున్నారు. అయితే.. ముగ్గురు డ్రైవర్ల విషయంలో అమితమైన ప్రేమ చూపిస్తున్న ఉన్నతాధికారి కారుణ్య నియామకాలను మాత్రం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది సుదీర్ఘంగా విధులకు రాకపోయినా, మరణించినా మానవతా దృక్పథంలో వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కల్పించి ఆదుకుంటారు. వారిపైనా కనికరం చూపడం లేదు. సుమారు 80 మంది కారుణ్య నియామకం గురించి దరఖాస్తు చేసుకున్నారు. ఏదొక పత్రం తక్కువైందనే సాకుతో వారిని ఇబ్బంది పెడుతున్నారని, అన్నీ సవ్యంగా ఉన్నా నియామక ఉత్తర్వులు ఇవ్వడం లేదని బాధితులు కన్నీరు పెడుతున్నారు. ఆప్కోస్ వెబ్‌సైటులో సర్వర్ సరిగా పనిచేయడం లేదంటూ ఎప్పటికప్పుడు దాటవేస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

'ఎన్ఎంఎం స్కాలర్‌షిప్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలి'

రాజమహేంద్రవరం, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2023 డిసెంబరులో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఈ ఏడాది ఆగస్టు 30లోపుగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు పేర్కొన్నారు. అలాగే 2020, 2021, 2022లో ఎంపికైన విదార్థులు కూడా తప్పకుండా రెన్యూవల్ చేసుకోవాలని చెప్పారు. కొత్త మొబైల్ యాప్, అప్డేట్ చేసిన వెబ్ వెర్షన్‌తో వన్ టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్) www.scholarships.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉందన్నారు. ఓటీఆర్ మాడ్యూల్ ఏడాది పొడవునా అందుబాటులో ఉంటుందని, ఈ విధానంలో వచ్చే 14 అంకెల సంఖ్య ఎన్ఎస్‌పీలో స్కాలర్‌షిప్ దరఖాస్తు కోసం అవసరం అవుతుందన్నారు. ఎన్ఎంఎంఎస్ తాజా/పునరుద్ధరణ దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 30 వరకూ మాత్రమే గడువు ఉందన్నారు. గత సంవత్సరంలో చేసిన మాదిరిగానే విద్యార్థి వివరాలను ఒక్క అక్షరం కూడా తప్పు రాకుండా మెరిట్ లిస్ట్, ఆధార్‌లో ఒకేలా ఉండే విధంగా సరి చూసుకొని పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకం విధి విధానాలు పూర్తిగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని.. వాటిని తప్పనిసరిగా పరిశీలించాలని వాసుదేవరావు చెప్పారు.



తాడిపూడి ఎత్తిపోతల పథకం నీటి విడుదల సందర్భంగా పూజలు చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు విడుదల

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

- 6లో

పెండింగ్ పనులపై కార్యాచరణ రూపొందించాలి : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై3: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులపై కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రాజమహేంద్రవరంలో 16వ నెంబరు జాతీయ రహదారి, ఎన్‌హెచ్ 216 ప్రారంభం నుంచి చివరివరకు రహదారులకు ఇరువైపుల ఆహ్లాదాన్ని కలిగించే పచ్చదనంతో కూడిన గ్రీనరీలు ఏర్పాటుచేసి అభివృద్ధి చేయాలన్నారు. అలాగే జిల్లా సరిహద్దులు ప్రజలకు తెలియజేసేవిధంగా బోర్డులు పెట్టాలని సూచించారు. మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఆగస్టు చివరి నాటికి వంతెనపై వాహనాల అనుమతించేవిధంగా సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. రాజానగరం ప్రాంతంలో ఏడీబీ రోడ్డు పనుల పురోగతిపై వివరాలు తెలిపారు. అనంతరం జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ డి సురేంద్రనాథ్ మాట్లాడుతూ లాలాచెరువు, ఐటీసీ జంక్షన్, బొమ్మూరు, వేమగిరిలలో ఫ్లైఓవర్ నిర్మాణం, సర్వీస్ రోడ్స్, లైటింగ్ సంబంధించి రూ.345 కోట్లు ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించడం జరిగిందన్నారు. గామన్ జంక్షన్ నుంచి దివాన్‌చెరువు వరకు 2.4 కిమీ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రూ.141 కోట్లు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించగా మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభించనున్నట్టు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్‌అండ్‌బీ అధికారి ఎస్‌బీవీ రెడ్డి, జాతీయ రహదారుల అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్రబాబు, ఆర్‌డీబీ ఈఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ పి ప్రశాంతి



కళామతల్లి కిరీటంలో కలికి తురాయి ఎస్వీఆర్ : మంత్రి దుర్గేష్

ధవళేశ్వరం, జూలై3: కళామతల్లి కిరీటంలో కలికి తురాయి ఎస్వీ రంగారావు అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం కాటన్ బ్యారేజ్ సమీపంలో నిలువెత్తు ఎస్వీ రంగారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వనటచక్రవర్తి ఎస్వీ రంగారావు జయంతిని జరుపుకుని ఆయనను గౌరవించుకోవడం ఆనందదాయకమన్నారు. ఎస్వీ రంగారావు అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వేడుకగా అల్లూరి జయంతి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 3 : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని రాష్ట్రస్థాయి వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు రాజమహేంద్రవరం గోదావరి బండ్ విద్యుత్ కార్యాలయం సమీపంలో వేడుకలు జరుగుతాయని, మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పాల్గొంటారని డీఆర్వో తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

'మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి'

ఉండ్రాజవరం, జూలై 3: రక్షితమంచినీటి పథకాలను ప్రతి రోజు విధిగా క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దమ్మెన్ను గ్రామంలో రక్షితమంచినీటి పథకాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పైపులు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ట్యాంకులను శుభ్రం చేయాలని చెప్పారు. బీసీ ఏరియాలో స్టాప్ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ జి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వై. భార్గవిదేవి, ప్రజలు పాల్గొన్నారు.

తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా

సాగునీరు విడుదల

● రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు



తాడిపూడి ఎత్తిపోతల పథకం వద్ద పూజలు చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, గోదారమ్మకు పూజలు చేస్తున్న మంత్రి

తాళ్లపూడి, జూలై 3 : రైతు సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం తాళ్లపూడి మండలం తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి ఆయకట్టుకు మంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పి ధర్మరాజులు సాగునీరును విడుదల చేశారు. తొలుత పూజలు చేసి, అనంతరం గోదావరి నదికి హరతులిచ్చి మోటారు స్విచ్ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుగా ఇరిగేషన్‌శాఖకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. గత ప్రభుత్వంలో ఎదురైన ఇబ్బందులు ప్రస్తావిస్తూ శివారు భూములకు సైతం నీరందేలా చర్యలు చేపడతామన్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా 14 మండలాల్లో 135 గ్రామాల రైతాంగానికి కాలువల ద్వారా 2 లక్షల 6 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పంపింగ్‌స్కీం నుంచి 1లక్షా 38 వేల ఎకరాలకు కాలువల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని, మెట్ట ప్రాంతాల్లో ఉన్న 65 వేల ఎకరాలకు సబ్ లిఫ్ట్‌ల ద్వారా సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశుతోష్ శ్రీవాస్తవ, ఇరిగేషన్ ఏపీ స్టేట్ ఎడ్వైజర్ ఎం వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ నరశింహమూర్తి, ఈఈలు దేవప్రకాష్, ఏసుబాబు, డీఈ రామేశంనాయుడు, ఏఈలు విజయ్‌కుమార్, శ్రీనివాస్, నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, నామన పరమేశ్వరరావు, ముళ్లపూడి శ్రీరామ చంద్రమూర్తి, గన్నిన సత్తిబాబు, కొఠారు వెంకట్రావు, గంటా కృష్ణ, యువగళం సభ్యులు సత్యేంద్ర, భరత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఎకరానికి సాగునీరు అందిస్తాం

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జూలై 3: నదుల అనుసంధానకర్త, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో ప్రతీ ఎకరానికి సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల పథకం నీటి విడుదల కార్యక్రమంలో ఆశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో ఎమ్మెల్యే మద్దిపాటి హాజరయ్యారు. ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ బీడుబారిన భూములను సాగులోకి తేవాలన్న సంకల్పంతో అన్న ఎన్‌టీఆర్ హార్స్‌పవర్‌కు రూ.50తో విద్యుత్‌ను అందించారన్నారు. అదే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2014-19 కాలంలో నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టి పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోలవరం కుడికాల్వ నంచి గోదావరి జలాలను కృష్ణానదిలో అనుసంధానం చేశారని అన్నారు. గత ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యంచేస్తే మరోమారు చంద్రబాబు ప్రభుత్వం వాటికి పునర్జీవం పోస్తుందన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా బుధవారం 22 మోటార్ల నుంచి 11పంపుల ద్వారా 8వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.


మంత్రి నిమ్మల రామానాయుడుతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు


మంత్రి సుభాష్‌కు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

అన్నవరప్పాడు వెంకన్నను

దర్శించుకున్న మంత్రి సుభాష్

పెరవలి, జూలై 3 : రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం అన్నవరప్పాడు వెంకన్నను దర్శించుకున్నారు. ఈ మార్గంలో వెళుతూ ఆయన అక్కడ ఆగి స్వామి వారిని దర్శించుకోవడంతో ఆలయ అర్చకులు, ఈవో రాధాకృష్ణ, ఆయనకు స్వాగతం పలికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా అక్కడున్న భక్తులు రాష్ట్ర మంత్రి అన్నవరప్పాడు ఆలయానికి రావడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు.

వినాయకుడికి మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే ముప్పిడి


వినాయకుడి గుడి వద్ద మొక్కు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 3 : కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వినాయకుడి ఆలయంలో మొక్కు తీర్చుకున్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద టీడీపీ నాయకులు పొట్రు మురళీకృష్ణ నివాసంవద్ద ఉన్న వినాయకుడి ఆలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావులకు టీడీపీ నాయకులు పొట్రు మురళీకృష్ణ, పొట్రు శమంతకమణి, పొట్రు తేజలు ఘన స్వాగతం పలికారు. మురళీకృష్ణ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు ఎమ్మెల్యేగా ముప్పిడి వెంకటేశ్వరరావు విజయం సాధించాలని వినాయకుడికి మొక్కుకున్నారన్నారు. బుధవారం మొక్కు తీసుకున్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, బర్ల శ్రీనివాస్, బొబ్బిలి పేర్రాజు, మాదిరెడ్డి సతీష్, డేగల రాము పాల్గొన్నారు.

నీటి నాణ్యతా పరీక్షలు చేపట్టిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు


కాపవరంలో తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

కొవ్వూరు, జూలై 3: కొవ్వూరు మండలం దొమ్మేరు, కాపవరం గ్రామాలలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. బుధవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ టి.రాజాతిలక్ ఆధ్వర్యంలో దొమ్మేరు, కాపవరం గ్రామాలలోని అన్ని బోర్లు తనిఖీచేసి, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దొమ్మేరు పంచాయతీ కార్యదర్శి డి.సుబ్బలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ డి.మోహనకృష్ణ, మైక్రోబయాలజిస్టు బి.సబిత, ఎస్.ఎన్.వి.గణేష్‌కుమార్, కొవ్వూరు ఆర్‌డబ్ల్యుఎస్ నీటి పరీక్షా ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లార్నెట్ విద్వాన్ తిరుమలరావుకి సత్కారం


క్లార్నెట్ విద్వాన్ తిరుమలరావుని సన్మానిస్తున్న శిష్య బృందం

తాళ్లపూడి, జూలై 3 : తాళ్లపూడిలోని ప్రముఖ బ్యాండ్ ట్రూప్ యజమాని టీవీ భద్రం మనవడు క్లార్నెట్ విద్వాన్ తిరుమలరావుకు అయన శిష్య బృందం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. క్లార్నెట్ విద్వాన్ తిరుమలరావుకు 17 ప్రాంతాలలో ఉన్న శిష్యబృందం అంతా కలిసి తమకు విద్యనేర్పిన గురువుకు క్లార్నెట్ అద్దకు స్వర్ణ అనుసును బహూ కరించారు. అనంతరం గ్రామంలోని ప్రముఖులు, పలువురు నాయకులు విచ్చేసి తిరుమలరావుని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పెరవలి సత్యనారాయణ, అన్నవరపు రాంబాబు, ర్యాలి శ్రీను, మనోహర్, వంశీ తదితర శిష్యబృందం పాల్గొన్నారు.

అంగవైకల్యం లేకున్నా

పింఛన్లు పొందుతున్న వైసీపీ నాయకులు


సచివాలయ సిబ్బంది నుంచి నాయకుల సమక్షంలో పింఛన్ అందుకుంటున్న దృశ్యం

పెరవలి, జూలై 3: అవయువాలు అన్నీ బాగున్నా ఆ నాయకులు అంగవైకల్యం సర్టిఫికెట్‌లు తెచ్చుకున్నారు. దీనిని ఆధారంగా చేసుకొని గత ప్రభుత్వ హయాంలో పింఛన్‌లు కూడా పొందారు. తూర్పుగోదావరిజిల్లా పెరవలి మండలం ఉసులుమర్రుకు చెందిన వైసీపీ నాయకులు బాగోతం గత 1వ తేదీన పింఛన్‌లు పంపిణీలో బయటపడింది. ఆ రోజు సచివాలయ సిబ్బంది పింఛన్‌లు పంపిణీ చేయడానికి వెళ్ళిన సమయంలో కూడా గ్రామంలో జనసేన, టీడీపీ కార్యకర్తలు కూడా వెళ్లారు. ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రామడుగుల సూర్యనారాయణ 2020 సంవత్సరం జనవరి నెలలో పక్ష వాతం కింద సర్టిఫికెట్ పొంది మంచానికి చక్రాల కుర్చీకి పరిమితం అయినట్లుగా నమోదు చేయించుకున్నారు. దీంతో అప్పటి ప్రభుత్వం ఐదువేల రూపాయలు మంజూరు చేసింది. అప్పటి నుంచి గత జూన్‌నెల వరకు ప్రతీనెలా 5 వేలు చొప్పున పెన్షన్ పొందుతూ వచ్చారు. టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అతని పంట పండింది. ఐదువేల పెన్షన్ ఒక్కసారిగా 15 వేలకు పెరిగింది. ఈనెల 1వ తేదీన సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పెన్షన్‌లు పంపిణీ చేయడంతో అతని ఇంటికి కూడా వెళ్లి స్థానిక నాయకులు సమక్షంలో పింఛన్ అందజేయగా జేబులో పెట్టుకున్నాడు ఆ వైసీపీ నాయకుడు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ నాగలక్ష్మి భర్త జన్ని గణపతి కూడా ఇదేవిధంగా అంగవైలకల్యం సర్టిఫికెట్ పుట్టించుకుని గత ప్రభుత్వ హయాంలో నెలకు 3 వేలు చొప్పున పింఛన్ పొందాడు. ప్రస్తుతం అదికూడా రెట్టింపు కావడంతో అందరితోపాటు అతనికి కూడా పెంచిన మొత్త 6 వేల రూపాయలు ఈ నెల 1న అందజేశారు. దీనిపై గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎంతోమంది నిజమైన వృద్ధులకు, వికలాంగులకు పింఛన్‌లు మంజూరు చేయని వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అన్యాయం గా ఇటువంటి వారికి ఏవిధంగా మంజూరు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఇటువంటి అక్రమ బాగోతాలు వెలికి తీసి ఆ పింఛన్‌లు రద్దు చేసి అర్హులైన మరింత కొత్త వారికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.


సమిశ్రగూడెంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందిస్తున్న మంత్రి దుర్గేష్

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

● మంత్రి కందుల దుర్గష్

నిడదవోలు, జూలై 3: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ తాను ఎంచుకున్న రంగంలో ఉన్నతస్థానానికి చేరేందుకు పాఠశాల విద్యే పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రి దుర్గేష్ స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా బాలికలు విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహి స్తారని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఎదగాలనే ఆలోచనతో స్పష్టమైన అవగాహన కలిగిఉండడం ఎంతో అవసరమన్నారు. పాఠశాలల్లో బాలికల డ్రాప్‌ఔట్స్ లేకుండా అధికార్లు కృషిచేయాలన్నారు. సమిశ్రగూడెంజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 398 మంది విద్యార్థులకు స్టుడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, విద్యాశాఖాధికారి కెవి గణేష్, ఎమ్‌పిడిఓ కెఎ ఝాన్సీ తదితర్లు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ ప్రసాద్

ఉండ్రాజవరం, జూలై 3: ఉండ్రాజవరం ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ జేడీవీ ప్రసాద్ బుధవారం ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుత ఎంపీడీవో కె. నరేంద్రరెడ్డి వ్యక్తిగత పనులపై సెలవు పెట్టినందున ఇన్‌ఛార్జి బాధ్యతలు ఈవోపీఆర్డీ చేపట్టారు. ఈమేరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఈవోపీఆర్డీకి పూలమాలతో అభినందించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఈవోపీఆర్డీ ప్రసాద్‌ను అభినందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఒక ఆధార్ కార్డు ఎన్నో సమస్యలకు పరిష్కారం

● ఎట్టకేలకు ఆధార్‌కార్డ్ అందుకున్న వెంకటలక్ష్మి


చాగల్లు ఎంపీడీవో బుజ్జి ఆధ్వర్యంలో ఆధార్ కార్డు అందజేస్తున్న దృశ్యం

చాగల్లు, జూలై 3 : ఒక ఆధార్ కార్డు ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిందని బాధితురాలు గెడ్డం వెంకటలక్ష్మి ఆనందం వ్యక్తం చేసింది. ఎంపీడీవో ఎస్.బుజ్జి, బాధితురాలు వెంకటలక్ష్మి (46) తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక మీనానగరానికి చెందిన గెడ్డం వెంకటలక్ష్మికి ఉంగుటూరుకి చెందిన కొండయ్యతో 15 సంవత్సరాలక్రితం వివాహం జరిగింది. వారికి నలుగురు పిల్లలు ఉన్నారు. 8 సంవత్సరాల భర్త ఆమెను వదిలివేసి వేరొక వివాహం చేసుకున్నాడు. గత్యంతం లేని పరిస్థితిలో ఆమె పుట్టింటికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ఆధార్‌కార్డు లేకపోవడంతో రేషన్ కార్డు రాలేదు. ఏవిధమైన ప్రభుత్వ పథకాలు అందడం లేదు. పెద్ద కుమారుడు 13 సంవత్సరాలు వయస్సు ఉన్నప్పటికీ తల్లికి ఆధార్‌కార్డు లేదని పిల్లలను పాఠశాలలో చేర్చుకోలేదు. గత 8 సంవత్సరాలుగా జిల్లావ్యాప్తంగా అనేక కార్యాలయాలు తిరిగినప్పటికినీ ఆధార్‌కార్డు రాలేదు. స్థానిక టీడీపీ యువ నాయకుడు నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి సహా ఆ పార్టీ నాయకులకు ఆమె సమస్యను చెప్పుకోగా ఎంపీడీవో దృష్టికి తీసుకుని వెళ్లి ఆధార్‌కార్డు లేకపోయిన అమ్మమ్మ ఆధార్‌కార్డు ఆధారంగా పాఠశాలలో ప్రవేశం పొందేవిధంగా చర్యలు తీసుకున్నారు. చాగల్లు 2 సచివాలయం ఆధార్ సీడింగ్ డిజిటల్ అసిస్టెంట్‌తో మాట్లాడి అధార్‌కార్డు వచ్చేలా కృషిచేశారు. ఎట్టకేలకు బుధవారం ఆధార్‌కార్డును వెంకటలక్ష్మికి ఎంపీడీవో ఎస్.బుజ్జి సమక్షంలో డిజిటల్ అసిస్టెంట్ రాధా శిరీషా అందజేశారు. ఆమెకున్న అర్హతలను బట్టి ఇతర ప్రభుత్వ పథకాలు అందేవిధంగా తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఆమెకు ధైర్యం చెప్పారు. ఆధార్‌కార్డు రావడానికి సహాయంచేసిన అధికారులు, టీడీపీ నాయకులకు ఆమె ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నాయకుడు రాజబాబుకు సత్కారం


టీడీపీ సీనియర్ నాయకుడు హోతా రాజబాబుకు పుష్పగుచ్ఛంతో సత్కరిస్తున్న జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు

గోపాలపురం, జూలై 3: కూటమితోనే రాష్ట్రంలో విజయశంఖారావం మోగిందని జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు అన్నారు. హుకుంపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు హోతా రాజబాబు జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు దుశాల్వ కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో దేవరపల్లి జనసేన అధ్యక్షుడు కాట్నం గణేష్, ప్రగాడ రాంబాబు, మద్దాల కాశీవిశ్వనాథ సనారి, గణపతి, ఫణి, సూర్య, భగవాన్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, అధికార్లు మారండి'


నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం బోర్డులో ఇంకా ఎమ్మెల్యేగా శ్రీనివాస్ నాయుడు పేరు ఉన్న దృశ్యం

నిడదవోలు, జూలై 3: సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. నిడదవోలు ఎమ్మెల్యేగా కందుల దుర్గేష్ ఎన్నికై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయినా నిడదవోలు పురపాలక సంఘం అధికార్లు పాలకవర్గంలో ఇంకా మార్పు రాలేదేమో అనిపిస్తోంది. కారణం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు మెంబర్ల జాబితాబోర్డులో ఎక్స్ ఆఫీషియో మెంబర్‌గా జి.శ్రీనివాస్ నాయుడు ఎమ్మెల్యే అని రాసి ఉండడం చూస్తుంటే మున్సిపాలిటి పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే ముప్పిడి


జిల్లా కలెక్టర్ ప్రశాంతిని కలిసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 3: ఎత్తిపోతల పథకాల తాత్కాలిక మరమ్మతులకు నిధులు కేటాయించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతిని కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముప్పిడి వెంకటేశ్వరరావు కలెక్టర్ ప్రశాంతికి కొవ్వూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాల పరిస్థితిని వివరించారు. గత 5 సంవత్సరాలుగా ఎత్తిపోతల పథకాల పట్ల నిర్లక్ష్యం వహించడంతో మోటార్లు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయన్నారు. దాదాపు 4 దశాబ్దాల క్రితం నిర్మించిన పంపింగ్ స్కీమ్‌లు కావడంతో మోటార్లు పూర్తిస్థాయిలో పాడైపోయాయని, కొత్తగా మోటార్లు ఏర్పాటుచేయాలని తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గంలోని 5 ఎత్తిపోతల పథకాలు కుమారదేవం, పైడిమెట్ట, బ్రాహ్మణగూడెం, చాగల్లు, వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకాల పరిధిలో 17940 ఎకరాల ఆయకట్టుకు సాగులో ఉందన్నారు. 5 పంపింగ్‌స్కీముల మరమ్మతులకు సంబంధించి రూ.21.32 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరనన్నారు. కుమారదేవం పంపింగ్ స్కీమ్ మరమ్మతులకు రూ.7.62కోట్లు, పైడిమెట్ట పంపింగ్ స్కీమ్‌కు రూ.5.30 కోట్లు, బ్రాహ్మణగూడెం పంపింగ్ స్కీమ్‌కు రూ.1.75 కోట్లు, చాగల్లు పంపింగ్ స్కీమ్‌కు రూ.1.55కోట్లు, వేగేశ్వరపురం పంపింగ్ స్కీమ్‌కు రూ.5.10 కోట్లతో ఎస్టిమేట్లు తయారుచేయించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశామన్నారు. అప్పటివరకు తాత్కాలిక మరమ్మతులకు ఒక్కొక్క పథకానికి రూ. 50లక్షలు నిధులు మంజూరు చేసినట్లయితే నియోజకవర్గంలో సుమారు 19940 ఎకరాల సాగు భూమికి నీరందుతుందన్నారు. ఆదేవిధంగా ఆర్టీసీ సర్వీసులన్నీ కొవ్వూరు డిపోకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి జలాలను శుద్ధిచేసి కొవ్వూరు పట్టణ ప్రజలకు అందించాలన్నారు. వీటిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. అధికారులతో ఎస్టిమేట్లు తయారుచేయించి తీసుకురావాలని సూచించారన్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటానని తెలిపారన్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేయడానికి వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి పంట కాలువలు పూడికలు తీయించాలని కోరామన్నారు. కాలువలు పూడిపోవడంతోపాటు, గుర్రపుడెక్క పెరిగిపోయిందని ప్రతి ఏడాది వర్షాకాలంలో పంటలు మునిగి రైతులు పంట నష్టపోతున్నారని తెలియజేశానన్నారు. ఎమ్మెల్యే వెంట ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, తదితరులు ఉన్నారు.

పల్లంట్లలో జలసిరి పథకంలో అవకతవకలు

● దర్యాప్తు చేపట్టాలని ఎంపీడీవోకు టీడీపీ నాయకుల వినతి


దేవరపల్లి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు, గ్రామస్థులు

దేవరపల్లి, జూలై 3: పల్లంట్లలో గత వైసీపీ ప్రభుత్వంలో జలసిరి పథకంలో అవినీతి, అక్రమాలు జరిగాయని పల్లంట్ల గ్రామానికి చెందిన గ్రామస్థులు, టీడీపీ నాయకులు గారపాటి వెంకటేశ్వరరావు, కూచిపూడి రాంపండు, పిన్నమనేని బుల్లబ్బులు అన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన గ్రామస్థులు, రైతులు, టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో ఎంపీడీవో ప్రభాకరరావుకు జలసిరి పథకంలో అవకతవకలపై దర్యాప్తు చేపట్టాలని వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లంట్లలో జలసిరి పథకం ద్వారా 59 బోర్లు మంజూరయ్యాయని వాటిలో 39బోర్లు వేశారని సుమారు ఆరుబోర్లు వెయ్యకుండానే వేరే రైతుల జలసిరి పథకంతో సంబంధం లేకుండా సొంతంగా బోర్లు వేసుకున్న వారి పేర్లతో బిల్లులు పెట్టుకుని ప్రభుత్వ సొమ్ము స్వాహా చేశారని అన్నారు. దీనిపై వెంటనే దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి, టీడీపీ నాయ కులు నలమాటి నాగేశ్వరరావు, గంగాధర్, తాళ్ళూరి శ్రీను, చింతాల దాసు, సంకురియ్య, గంగరాజు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే


దొమ్మేరు సావరం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రాడ్యుయేషన్ డే

కొవ్వూరు, జూలై 3 : కొవ్వూరు మండలం దొమ్మేరు సావరం అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. బుధవారం సీడీపీవో డి.మమ్మీ ఆధ్వర్యంలో దొమ్మేరు సావరం 1,2,3 అంగన్వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ విద్యను అభ్యసించిన 5 సంవత్సరాలు నిండిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించి గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.వెంకటపద్మిణి, అంగన్వాడీ కార్యకర్తలు అనంతలక్ష్మి, పి.పద్మ, కెఎన్‌కె దేవి, సచివాలయ ఎంఎస్‌కెలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కొవ్వూరు, జూలై 3: ట్రాక్టరును ఢీకొని వ్యక్తి గాయపడి చికిత్స పొందుతూ మృతిచెంది నట్లు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఏలూరు దక్షిణం వీధికి చెందిన వీణం సుబ్బారావు తన కుమారుడు వీణం మణికంఠ(21)తో కలిసి ఈనెల 2వ తేదీన బైక్‌పై ఏలూరు నుంచి రాజమహేంద్రవరం బయలుదేరారు. ఎన్‌హెచ్‌పై కొవ్వూరు మండలం కాపవరం ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి చేరుకునేసరికి ముందువెళ్తున్న ట్రాక్టరు డ్రైవర్ సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మణికంఠ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వీణం సుబ్బారావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

● ఐసీడీఎస్ పీడీ విజయకుమారి

రంగంపేట, జూలై 3: డయేరియాపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజల్లో అవగాహన కల్పించేలా అందరూ కలిసి పనిచేయాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా బుధవారం రంగంపేట మండలం ఈలకొలను, జి.దొంతమూరు, వీరంపాలెం గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలలో గల తల్లులతో సామావేశాలు నిర్వహించారు. స్టాప్ డయేరియా కోసం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ డయేరియా వ్యాధి గురించి 5 సంవత్సరాలలోపు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో వేడిగా ఉన్న ఆహారాన్ని అందించాలని, కాచి చల్లార్చిన తాగునీటి ఇవ్వాలని ఆమె సూచించారు.